ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

సోమవారం 10 మార్చి 2025

**** ఇఫ్తార్ : 6.30 | సహర్ : 5.06 (సోమవారం)

**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | :18004251442 |
| యాదాద్రి | :1800 425 7106 |
| సూర్యాపేట | :1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 60

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.112 | 175 | 200 |
| సూర్యాపేట | రూ.125 | 180 | 210 |
| నల్లగొండ | రూ.125 | 195 | 210 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 । కనిష్ఠం 19.0

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలో నాలుగు నల్లగొండకే



దయాకర్ శంకర్ నాయక్ శ్రవణ్ సత్యం

- ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్‌నాయక్
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా అభ్యర్థిత్వాలు ఖరారుచేసిన కాంగ్రెస్
- ప్రతిపక్ష బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసోజు స్వస్థలం నల్లగొండ
- సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం

రాష్ట్ర రాజకీయాలకు మలుపు కేంద్రంగా మారిన నల్లగొండకే రాష్ట్రంలో అన్ని పార్టీలు ప్రాధాన్యమిస్తున్నాయి. తాజాగా జరుగుతున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐదింటికి నలుగురు అభ్యర్థులు నల్లగొండ జిల్లా వారే ఉన్నారు. అధికార కాంగ్రెస్ ప్రకటించిన ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరు ఉమ్మడి నల్ల గొండ జిల్లాకు అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్‌నాయక్ కాగా, మిత్ర పక్ష సీపీఐ అభ్యర్థిత్వం సైతం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యానికి దక్కింది. వీరితోపాటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం దక్కించుకున్న దాసోజు శ్రవణ్‌కుమార్ సైతం నల్ల గొండ బిడ్డే కావడం విశేషం. మొత్తంగా ఏక సమయంలో వేర్వేరు వేదికల ద్వారా నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు పెద్దల సభకు వెళ్లేందుకు అవకాశం దక్కించుకోవడం ద్వారా జిల్లా ప్రతిష్ఠ ఇనుమడింపజేశారనే చర్చ సాగుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అతి భారీ మెజార్టీలు అందించిన నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు దళిత, గిరిజన నాయకులను ఏక సమయంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎంపికచేసి పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని పెంపొందించింది. శనివారం ప్రకటించిన ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఇద్దరు నల్లగొండకు చెందినవారే ఉండడం కాంగ్రెస్‌ను మిక్కిలిగా ఆదరించిన నల్లగొండ జిల్లాకు ప్రభుత్వంలోనూ అంతేస్థాయిలో ప్రాధాన్యమిచ్చి, నల్లగొండ గౌరవాన్ని ఇనుమడింపజేసిందనే చర్చ పార్టీ శ్రేణుల్లో సాగుతోంది. శనివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రకటించిన ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌కు అవకాశం దక్కింది. ఈ నేతలిద్దరికీ అవకాశం రావడం పార్టీలో సామాన్య కార్యకర్తలకు లభించిన గౌరవంగా భావిస్తున్నారు.

**సామాన్య కార్యకర్త నుంచి ఎదిగిన శంకర్‌నాయక్**

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కేతావత్ తండాకు చెందిన....

- మిగతా 7వ పేజీలో...

# వేసవికి ముందే వెతలు



పడిపోయిన భూగర్భజలాలు

| జిల్లా | పడిపోయిన నీటిమట్టం (మీ.లో) |
|---|---|
| నల్లగొండ | 7.74 |
| సూర్యాపేట | 3.60 |
| యాదాద్రి | 2.36 |

జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఫిబ్రవరి, మార్చి రెండో వారంలోనే పరిస్థితులు ఈ విధంగా ఉంటే రాబోయే రోజుల్లో మరింత ప్రమాద ఘంటికలు మోగే అవకాశాలున్నాయి. కొన్ని రోజులుగా అంతకంతకూ నీటి మట్టాలు పడిపోతున్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో సాగునీటికోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండలు తీవ్రమవుతు న్న విషయం తెలిసిందే. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 36.5 నుంచి 37 డిగ్రీలకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతోపాటు భూగర్భజలాలు తగ్గి పంటలకు నీరందడంలేదు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేట(కలెక్టరేట్)

- ఎడిపోతున్న భూగర్భజలాలు
- నాన్ ఆయకట్టులో ఎండుతున్న బోర్లు
- పలు చోట్ల పంటలు ఎండిపోతున్న పరిస్థితులు
- రాబోయే రోజుల్లో మరింత ప్రమాద ఘంటికలు



**నాలుగేళ్లలో నల్లగొండ జిల్లాలో భూగర్భ నీటిమట్టాలు ఇలా..**

| డివిజన్ | ఫిబ్రవరి 2022 | ఫిబ్రవరి 2023 | ఫిబ్రవరి 2024 | ఫిబ్రవరి 2025 |
|---|---|---|---|---|
| నల్లగొండ | 4.85మీటర్లు | 6.05మీటర్లు | 8.52మీటర్లు | 8.59మీటర్లు |
| దేవరకొండ | 6.14మీటర్లు | 5.71మీటర్లు | 10.35మీటర్లు | 8.44మీటర్లు |
| మిర్యాలగూడ | 5.71మీటర్లు | 6.83మీటర్లు | 10.76మీటర్లు | 6.23మీటర్లు |
| మొత్తం | 5.47మీటర్లు | 6.12మీటర్లు | 10.06మీటర్లు | 7.74మీటర్లు |

నల్లగొండ జిల్లాలో ఫిబ్రవరి నెలాఖరు నాటికి జిల్లాలో సగటున భూగర్భజలాలు 7.74మీటర్లుగా నీటిమట్టం నమోదైంది. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రతకు భూగర్భజలాలు మరింత వేగవంతంగా పడిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా నీటిమట్టాలు పడిపోతుండటంతో బోర్లు ఎండిపోవడంతోపాటు ఆగుకుంటూ పోస్తున్నాయి. చేతికొచ్చే ముందు పంటలు ఎండిపోతుండటంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు బోర్లను వేస్తున్నారు. దీంతో రైతులు అటు బోర్లు పడక ఇటు పంటలు ఎండిపోతుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. గత వర్షకాలంలో జిల్లాలో పెద్దగా వర్షాలు కురవక పోవడంతో చెరువులు, కుంటల్లో నీళ్ల లేకుండా పోయాయి. దీంతో భూగర్భజలాలు లేక బోరు బావులపై ప్రభావం చూపుతుంది. గత వానాకాలంలో అడపదడ పా కురిసిన వర్షాలతో పంటలు చేతికొచ్చిన యాసంగిలో మా త్రం కష్టాలు తప్పడంలేదు. వేలాది ఎకరాల్లో వరి పంటలతోపా టు పంటల తోటలు కూడా ఎండిపోతున్నాయి. నీటి ఎద్దడిని ఎదుర్కోవడం కోసం పెద్దఎత్తు న రైతులు బోర్లు వేస్తున్నారు. ఒక్కో రైతు ఏకంగా నాలుగైదు బోర్లు వేస్తున్నప్పటికీ నీటి చుక్క కూడా పడటంలేదు. ఒక్కో బోరుకు సగటున రూ.50వేల వరకు ఖర్చవుతున్నట్లు వాపోతున్నారు. భూగర్భంలో జలాలు లేకపోవడంతో 100అడుగుల లోతు వరకుబోర్లు వేసినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదని తెలుస్తోం ది. జిల్లా భూగర్భ జలవనరుల శాఖ...

- మిగతా 7వ పేజీలో...

## ఎండుతున్న వరి

- పశువులకు మేతగా మారుతున్న పంట
- పంటను కాపాడుకోవడానికి పడరాని పాట్లు
- తలాపున ప్రాజెక్టు ఉన్న పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గుండాల: గుండాల మండలంలో పంటలు ఎండిపోతున్నాయి. నవాబుపేట రిజార్వాయర్‌నుంచి దేవాదుల కాల్వల ద్వారా నీరు అందించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో కాల్వల ద్వారా నీరు అందక పోవడంతో వరి పంట బీటలువారి పశువులకు మేతగా మారుతుంది. కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి పంటను కాపాడాలని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేక సార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గంధమల్ల నుంచి బిక్కేరు వాగులోకి నీరు విడుదల చేయడంతో మండలంలోని అనంతారం, సుద్దాల, బ్రాహ్మణపల్లి, అంబాల, వంగాల, పెద్దపడిశాలకు చెందిన బిక్కేరు వాగు ప్రాంతంలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. లేదంటే బిక్కేరు వాగు ప్రాంతంలోని రైతులు కూడా ఇబ్బందులు పడేవారు. బీర్ల అయిలయ్య చొరవ తీసుకుని నవాబుపేట రిజర్వాయర్ నుంచి దేవాదుల కాల్వ ద్వారా నీరు అందించి మండలంలోని చెరువులు, కుంటలు నింపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**పంటల కోసం నానా తంటాలు..**

ఈ సంవత్సరం మండలం లో వర్షాలు తక్కువగా కురవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. దీంతో వరి సాగు చేసే రైతులు వానాకాలం నుంచే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది గమనించిన రైతులు గత ఏడాదికంటే వరి పంటను తక్కువగా సాగు చేశారు. గత సంవత్సరం యాసంగిలో 15వేల ఎకరాలు సాగు చేస్తే, ఈ సంవత్సరం 12వేల ఎకరాలు మాత్రమే సాగు చేశారు. నీరులేక కళ్ల ముందే చేతికొచ్చే పంట ఎండిపోతుండడంతో కొంత మంది రైతులు పాత బావులు పూడికతీస్తుండగా, మరికొంత మంది రైతులు కొత్తగా బోర్లు వేస్తున్నారు. బోర్లలో....

- మిగతా 7వ పేజీలో...



గుండాల మండలం పాచిల్లలో..

## ఇన్‌సైడ్



**వ్యవసాయ కళాశాల కలేనా?**

వ్యవసాయ పరిశోధన స్థానే కొత్త వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు మంత్రి హామీ

6



**హెచ్ఎండీఏ విస్తరణ దిశగా..**

- ఆర్ఆర్ఆర్ రెండు కిలో మీటర్ల ఆవల వరకు విస్తరణ
- యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో 10 మండలాలు చేరిక
- శివారు ప్రాంతాల్లో అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు

6



**దైవ దర్శనానికి వెళుతూ..**

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఇద్దరి దుర్మరణం, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు
- నార్కట్‌పల్లి మండలంలో ఘటన

6



## చూడముచ్చటగా యాదగిరీశుడి రథోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు ఆదివారం కల్యాణ లక్ష్మీనరసింహుడు దివ్య విమాన రథంలో భక్తులకు దర్శనమిచ్చారు. లోకకల్యాణం, విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో పాంచరాత్రాగమరీతిలో రథోత్సవాన్ని చేపట్టారు. విద్యుత్ దీపాల కాంతులు విరజిమ్ముతుండగా వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా స్వామివారి దివ్య విమానరథాన్ని అలంకరించారు. లక్ష్మీనారసింహ స్వామి దంపతులను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై అధిష్ఠింపజేశారు. కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు రథపగ్గాలు ప్రారంభించారు.

7



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

## ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందిండచమే లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రత్తి పెల్లి గ్రామశివారులో పులిపలుపుల చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లోరైడ్‌పీడిత ప్రాంతమైన మునుగోడు ప్రాంతానికి కృష్ణాజలాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. చెరువు పూర్తిగా నిండితే సమీప గ్రామాల్లో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. కట్టపైనుంచే ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పులిపలుపుల చెరువులోకి నీళ్ల ఎక్కువగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని రత్తిపెల్లి, గంగోత్రి గూడెం, పులిపల్పుల, కలవపల్లి గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, ఉపాధ్యక్షుడు దోటి నారాయణ, జిల్లా నాయకులు వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మాదగోని రాజేష్ గౌడ్, జక్కుల శ్రీనివాస్, పాలకూరి యాదయ్యగౌడ్, జాజుల సత్యనారాయణ, పుట్ట శ్రీనివాస్ రెడ్డి గోపగాని పాపయ్య, బల్గూరి నరసింహ తదితరులు ఉన్నారు.



పులిపల్పుల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

## జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాతీయ సదస్సు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అభివృద్ధి, ఆర్థికపరమైన అంశాలతో కూడిన జా తీయ సదస్సును తొలిసారిగా నియోజకవర్గ కేంద్రంలో ఆవిష్కరించడం గొప్ప విషయమన్నారు. అందుకు కారణమైన కళాశాల అర్థశాస్త్ర విభాగాధిపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దే శ నలుమూలల నుంచి వచ్చే ఉప కులపతులు, నిపుణులకు పట్టణ, పరిసర ప్రాంత విద్యావేత్తలు ఘనస్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ నరేష్ గుమ్మడి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, త్రాసు వెంకటరమణ, వేణు పాల్గొన్నారు.



## ముగిసిన సాగరమాత ఉత్సవాలు

నాగార్జునసాగర్, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఏసు ప్రభువుకు ఎల్లప్పుడు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట రక్షదాయకమని గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నబత్తిని భాగ్యయ్య అన్నారు. నాగార్జునసాగర్ విజయపురిసౌత్(రైట్‌బ్యాంకు)లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మేరిమాత తిరునాళ్ల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమష్టి దివ్యబలి పూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం మాట్లాడారు. పవిత్రాత్మ ప్రభావంతో కన్నె అయిన మేరిమాత గర్భాన దివ్యజ్యోతి అయి ఏసు ప్రభువును ఈ జగతికి ప్రసాదించినట్లు తెలిపారు. పవిత్ర మూర్తి అయిన ఏసుక్రీస్తును స్తుతించుకోవాలన్నారు. ఆధ్యాత్మిక ఆయుధమైన ప్రార్థన, ప్రేమ, నీతి, కరుణ, దయ, క్షమ గుణాలను కలిగిన వ్యక్తులు దేవుని మార్గంలో నడిపించ బడతారని అన్నారు. సాగర మాత మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు దేవుడు ఐశ్వర్యం, ఆయురారోగ్యాలు ప్రసాదించా లని ప్రార్థించారు. ఆదివారం ఉదయం సాగరమాత రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు అత్తలూరు గురువు చాట్ల కస్పాల్‌చే దివ్యబలి పూజ, ఆరు గంటలకు కారంపుడి విచారణ గురువు పెట్ల మర్రి అనిల్, ఏడు గంటలకు ముట్లూరు విచారణ గురువు మార్నేని దిలిప్, ఎనిమిది గంటలకు దాచేపల్లి విచారణ గురువు ఏరువ బాలశౌరీ, 10 గంటలకు గుంటూరు పీఠాధిపతి చిన్నబత్తిని భాగ్యయ్యలతో సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరిమాత ఆలయం విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# విస్తరణ దిశగా హెచ్‌ఎండీఏ

» ఆర్‌ఆర్‌ఆర్ రెండు కిలోమీటర్ల ఆవల వరకు విస్తరణ
» యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో 10 మండలాలు చేరిక
» శివారు ప్రాంతాల్లో అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు



(ఆంధ్రజ్యోతి- చౌటుప్పల్): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) విస్తరణ కు రంగం సిద్ధమైంది. హెచ్‌ఎండీఏను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రస్తుతం ఏడు జిల్లాలు, 74మండలాలు, వెయ్యి గ్రామ పంచాయతీలకు పైగా విస్తరించి ఉన్న హెచ్‌ఎండీఏ విస్తీర్ణం మరింత పెరగనుంది. తాజాగా గురువారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో హెచ్‌ఎండీఏ పరిధి విస్తరణకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో కొత్తగా నాలుగు జిల్లాలు, 32 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో చేరనున్నాయి. త్వరలో నిర్మించనున్న రీజనల్ రింగ్ రోడ్ పరిధిని దాటి మరో రెండు కిలోమీటర్ల ఆవల వరకు విస్తరించే అవకాశముంది. ప్రస్తుతం హెచ్‌ఎండిఏ 7,257 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దీని పరిధి సుమారు 12వేల చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించనుంది. సుమారు 17ఏళ్ల తర్వాత హెచ్‌ఎండీఏ పరిధి పెరుగనుండడంతో అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి.

### మూడు ప్రాంతాలుగా విభజన

రాజధానికి నలువైపులా ఉన్న ప్రాం తాలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. అందులో భాగంగా రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించనుంది. నగరం నడిబొడ్డు నుంచి ఔటర్‌రింగ్ రోడ్డు వరకు ఆనుకొని ఉన్న ప్రాంతాన్ని కోర్ అర్బన్‌గా, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి త్వరలో నిర్మించనున్న రీజనల్ రింగ్ రోడ్ వరకు ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి మిగతా ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా పరిగణించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్,రంగారెడ్డి, మల్కాజిగిరి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి,మెదక్, సిద్దిపేట జిల్లాలో హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నల్లగొండ, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలు కొత్తగా దీని పరిధిలో చేరనున్నాయి. నాలుగు జిల్లాల పరిధిలో కొత్తగా 32మండలాలు హెచ్‌ఎండీఏ లో కలవనున్నాయి. దీంతో 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలతో హెచ్‌ఎండీఏ కొత్త రూపు సంతరించనుంది.

### 2051 వరకు ప్రణాళికలు

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని హెచ్‌ఎండీఏ నూతన ప్రణాళికలు పంపించనుంది. మరోవైపు త్రిబుల్ ఆర్ ఆవల వరకు హెచ్‌ఎండీఏ పరిధి పెరగనుండడంతో దాని కనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి సమగ్ర మాస్టర్ రూపొందించేందుకు హెచ్‌ఎండీఏ కసరత్తు ప్రారంభించింది. ఇప్పుడున్న మాస్టర్ ప్లాన్లను విలీనం చేసి ఒకే మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది.దీనికి సంబంధించి ఆసక్తి గల సంస్థల నుంచి వచ్చే నెలలో ఆన్లైన్ బిడ్డింగ్‌ను ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. మాస్టర్ ప్లాన్‌లో ఏ అంశాలను ఎక్కడ చేర్చాలని దానిపై కసరత్తు చేయనున్నట్లు సమాచారం.

**యాదాద్రి, నల్లగొండ జిల్లాలో కొత్తగా చేరే మండలాలు**

హెచ్‌ఎండీఏ విస్తరణలో భాగంగా యాదాద్రిభువనగిరి, నల్లగొండ జిల్లాలో కొత్తగా 10 మండలాలను చేర్చేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఐదు, నల్లగొండ జిల్లాలో ఐదు మండలాలను చేర్చడానికి ప్రతిపాదన రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. యాదాద్రి జిల్లాలో నూతనంగా 5 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో కొత్తగా చేరానున్నాయి. ఇప్పటికే ఉన్న మండలాలతో పాటు కొత్తగా రాజపేట, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, మండలాలు హెచ్‌ఎండీఏలో కలవనున్నాయి. నల్లగొండ జిల్లాలో కూడా ఐదు మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో చేరానున్నాయి. జిల్లాలోని మర్రిగూడ, నాంపల్లి, మునుగోడు, చండూరు, చింతపల్లి మండలాలలోని కొన్ని గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి రానున్నాయి. హెచ్‌ఎండీఏ విస్తరణకు సంబంధించి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిన వాటిలో ఇవే మండలాలు ఉన్నాయా.. లేదా ఏమైనా మార్పులు చేర్పులు జరిగాయా అనేది అధికారికంగా తెలియాల్సి ఉంది.

# వ్యవసాయ కళాశాల కలేనా?

» వ్యవసాయ పరిశోధన సంస్థ స్థానే కొత్త వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు గత ఏడాది మంత్రి హామీ




వ్యవసాయ పరిశోధనా స్థానం

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ, వ్యవసాయం): నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగ ర్ వ్యవసాయ పరిశోధనా స్థానంలో కొత్త వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేస్తామని వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చి ఏడాది అయింది. నేటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఎటువంటి ప్రతిపాదనలు కూడా సిద్ధం కాలేదని సమాచారం. కంపసాగర్ వ్యవసాయ పరిశోధనా స్థానానికి 2004 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేశారు. 2005లో ప్రారంభించారు. 2008లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిదిన ఘనత ఈ కళాశాల దక్కించుకుంది. పాలిటెక్నిల్ తర్వాత వ్యవసాయ బీఎస్సీ కళాశాల ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ పరిశోధనా స్థానం సాగర్ ఆయకట్టు పరిధిలో ఉండడంతో పరిశోధనకు అపార వనరులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో అధిక శాతం వ్యవసాయాధారిత కుటుంబాలు ఉన్నాయి. అగ్రికల్చర్ బీఎస్సీ విద్య అభ్యసించాలంటే ఈ ప్రాంతవాసులు హైదరాబాద్, అశ్వారావుపేట, పాలెంతో పాటు వివిధ సుదూర ప్రాంతాల కళాశాలలకు వెళ్లే వారు. ఇక్కడ కళాశాలను ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల నెలకొల్పితే యువత ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం వైపునకు మొగ్గు చూపే అవకాశముంది.

### అపార వనరులు

కంపసాగర్ వ్యవసాయ పరిశోధనా స్థానం మొత్తం 305 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించింది. కేవీకే, వివిధ అవసరాలకు పోను 200ఎకరాల వరకు పరిశోధనా స్థానం పరిధిలో ఉంది. సాగర్ ప్రధాన ఎడమ కాల్వకు సమీపంలో ఉండడంతో వరి పంటల సాగుకు నీరు సమృద్ధిగా లభ్యమవుతుంది. వానాకాలంతో పాటు యాసంగిలో రెండు పంటలు సాగవుతుంది. ఇక్కడ ఆధునిక వరి వంగడాల రూపకల్పనపై పరిశోధనలు జరుగుతున్నాయి. సుమారు వంద ఎకరాల వరకు వరి విత్తనోత్పత్తి చేసి విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతంలో కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థుల పరిశోధనల కు ఉపయోగకరంగా ఉంటుంది. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు మాత్రం యూనివర్సిటీ నుంచి బీఎస్సీ కళాశాల ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు ఇప్పటి వరకు రాలేదని చెబుతున్నారు. వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**మంత్రి హామీని నెరవేర్చాలి**



వ్యవసాయ పరిశోధనా స్థానంలో అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాలను ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చి ఏడాది సమయం దాటింది. ఇప్పటి వరకు ఎటువంటి ప్రతిపాదనలు రాలేదు. ఇక్కడ కాకుండా పక్క జిల్లాలోని మరో ప్రాంతంలో కళాశాల ఏర్పాటు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. అన్ని రకాల అనుకూలతలు ఉన్న ఈ ప్రాంతంలోనే కళాశాలను ఏర్పాటు చేసి మంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.
- దైద శ్రీను, సీపీఎం నాయకుడు

## ట్రాన్స్‌కోలో అవినీతి కలకలం

**ఇప్పటివరకు ఏసీబీకి పట్టుబడిన నలుగురు చౌటుప్పల్ అధికారులు**

చౌటుప్పల్ టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ట్రాన్స్‌కో (ఆపరేషన్) ఏడీఈ గాజుల శ్యాంప్రసాద్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సంఘటన విద్యుత్ శాఖలో కలకలం రేపుతోంది. ఇదివరకు పట్టణంలో ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీకి చిక్కితే అందులో నలుగురు ట్రాన్స్‌కో అధికారులే ఉన్నారు. మూడు దశాబ్ధాలుగా అవినీతి అధికారులు వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్నా మార్పు కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏఏఈ సర్వారెడ్డి, ఏఈఈ శ్రీనివాస్, లైన్‌మెన్ ఎంపళ్ల వెంకటరెడ్డి ఏసీబీకి పట్టుబడ్డారు. తాజాగా ఏడీఈ శ్యామ్ ప్రసాద్ రూ.70వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. 23 ఏళ్ల క్రితం పంచాయతీరాజ్ శాఖ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఏసీబీ పట్టుబడ్డారు.

## 240 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత




పెద్దవంగర(మహబూబాబాద్ జిల్లా), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి.. డీసీఎం, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికిరణ్ తెలిపారు. నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం రుద్రాయగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ మేకల నాగయ్య, హైదరాబాద్ కొత్తపేటకు చెందిన ఐతే క్రిష్ణ ఖమ్మం జిల్లాలో రేషన్‌బియ్యం కొనుగోలు చేశారు. డీసీఎం వాహనంలో రూ.4,68,000 విలువ చేసే 240 బస్తాల్లో 120 క్వింటాళ్ల బియ్యాన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని కొరిపెల్లి శివారు వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా, పక్క సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, ఇరువురిపై కేసు నమోదు చేసి, డీసీఎం సీజ్ చేశారు.

## ప్రణయ్ హత్య కేసు తీర్పు నేడు

● కోర్టులో ఆధారాలు, సాక్ష్యాలు సమర్పించిన పోలీసులు
● ఏడు సంవత్సరాలు సాగిన విచారణ



ప్రణయ్ (ఫైల్)

నల్లగొండ క్రైం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసు తీర్పును ఎస్సీ, ఎస్టీ రెండో అదనపు జిల్లా కోర్టు సోమవారం వెల్లడించనుంది. మిర్యాలగూడకు చెందిన పెరుమాళ్ల ప్రణయ్-అమృత వర్షిణి పాఠశాల స్థాయి నుంచే క్లాస్‌మేట్స్ కావడంతో ప్రేమించుకున్నారు. ఇంట్లో చెప్పి ప్రేమ వివాహం చేసుకోవాలని ప్రయత్నించగా, కులాలు వేరు కావడంతో అమృత తండ్రి మారుతీరావు ఒప్పుకోలేదు. అయినా ప్రణయ్- అమృతలు కులాంతర వివాహం చేసుకున్నారు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె తన మాట వినకుండా కులాంతర ప్రేమ వివాహం చేసుకోవడంతో తీవ్రమైన కోపంతో ఉన్న మారుతీరావు ప్రణయ్‌ను హత్య చేయించేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో సుపారీ గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి ప్రణయ్‌ను హత్య చేయించేందుకు పథకం పన్నాడు. 2018 సెప్టెంబరు 14వ తేదీన మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లిన ప్రణయ్, అమృత తిరిగి కారు వద్దకు వస్తుండగా సుపారీ గ్యాంగ్ లోని ఓ వ్యక్తి పదునైన కత్తితోని ప్రణయ్ మెడపై రెండుసార్లు బలంగా నరకడంతో ప్రణయ్ మృతిచెందాడు. ప్రణయ్ తండ్రి బాలస్వామి మిర్యాలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసులో ఏడుగురిని గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు 302, 120 బి, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ హత్యలో ఎ-1గా అమృత తండ్రి మారుతీరావు, ఎ-2గా సుభాష్‌శర్మ, ఎ-3గా అజ్గర్ అలీ, ఎ-4గా అబ్దుల్ బారీ, ఎ-5గా కరీం, ఎ-6గా అమృత బాబాయి శ్రవణ్, ఎ-7గా శివ, ఎ-8గా నదీమ్‌ను చేర్చి పోలీసులు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేశారు.

### ప్రధాన నిందితుడు మారుతీరావు ఆత్మహత్య

ఈ హత్య కేసును ఎదుర్కోవడంతో పాటు పలు ఇబ్బందుల కారణంగా మారుతీరావు మానసికంగా తీవ్రంగా కుంగిపోయాడు. బెయిల్ వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే 2020లో హైదరాబాద్‌లోని వాసవీ భవన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎనిమిది మంది నిందితులు జైలుకు వెళ్లిన అనంతరం ఈ కేసులో ఆరుగురు నిందితులు 2019లో బెయిల్‌పై వచ్చారు. అప్పటికే పలు కేసుల్లో ఉన్న సుపారీ గ్యాంగ్‌కు చెందిన ఎ-2 సుభాష్‌శర్మపై గుజరాత్ మాజీ హోం మంత్రి అరుణ్‌పాండే హత్య కేసుతో పాటు పలు కేసుల్లో నిందితుడిగా సబర్మతి జైలులో ఉన్నాడు. మరో నిందితుడు ఎ-3గా ఉన్న అజ్గర్ అలీపై కూడా పలు కేసులు ఉండడంతో ఆయన ప్రస్తుతం చంచల్‌గూడ జైలలో ఉన్నాడు. ప్రణయ్ హత్య చేసేందుకు ఎంత సుపారీ మాట్లాడుకున్నారు.. హత్యకు ప్లాన్ ఎలా వేశారు. ఎన్ని సార్లు రెక్కీ నిర్వహించారు.. వీరంతా ఎక్కడి నుంచి వచ్చారు. ప్రణయ్‌ని ఎందుకు హత్య చేయాలనుకున్నారు. హత్యలో పాల్గొన్న నిందితులు మారుతీరావుకు ఎప్పటి నుంచి పరిచయం అనే విషయాలతో పాటు అన్ని వివరాలను, ఆధారాలు, సాక్ష్యాలను కోర్టుకు పోలీసులు ఇప్పటికే సమర్పించారు. సబర్మతి జైలులో ఉన్న సుభాష్‌శర్మను వర్చువల్‌గా హాజరు పరిచే అవకాశం ఉండగా, మిగతా నిందితులను సోమవారం జిల్లా కోర్టులో హాజరు పర్చనున్నారు. ఏడు సంవత్సరాల తర్వాత ప్రణయ్ హత్య కేసు తుది తీర్పుకు రావడంతో అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ప్రణయ్ తండ్రి బాలస్వామి కూడా ఇప్పటికే తన కుమారుడిని కిరాతకంగా హత్య చేశారని, న్యాయం జరగాలని ఆయన కోరిన విషయం తెలిసిందే.

# దైవ దర్శనానికి వెళ్తూ మృత్యుఒడిలోకి..

● ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు ● ఇద్దరు మృతి, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు ● నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటంలో ఘటన



నుజ్జునుజ్జయిన కారు, సందీప్‌గౌడ్, సాయికుమార్(ఫైల్)

నార్కట్‌పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన హైద్రాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం గ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కుమ్మరిబస్తి, అల్వాల్‌లకు చెందిన చిలసాగరం సందీప్‌గౌడ్, కుంచ సాయికుమార్‌గౌడ్, ప్రవీణ్, మధుకర్, హరీశ్ ప్రాణస్నేహితులు. వీరిలో ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తుండగా, ముగ్గురు వ్యాపారాలు చేస్తున్నారు. ప్రతి వారంతపు సెలవును సరదాగా గడిపేందుకు పర్యాటక ప్రదేశాలకు వెళ్తుంటారు. ఇందులో భాగంగానే శనివారం అర్ధరాత్రి రెండు గంటలకు హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో స్నేహితులూ కలిసి విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనానికి టీఎస్-08 జీపీ 8686 నెంబర్ గల కారులో బయలుదేరారు. నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామ శివారుకు ఆదివారం తెల్లవారుజామున చేరుకున్నారు. అదే సమయంలో రోడ్డు పక్కన ఉన్న హోటల్‌లో టీ తాగేందుకు లారీని డ్రైవర్ రోడ్డుపై నిలిపాడు. కమ్ముకొచ్చిన మంచు కారణంగా రోడ్డుపై నిలిపి ఉన్న లారీని గమనించకుండా వీరు ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయి సందీప్‌గౌడ్(27), సాయికుమార్‌గౌడ్(35) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

సమాచారం తెలిసిన వెంటనే ఎస్‌ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో వెళ్లి క్షతగాత్రులను సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను అతి కష్టం మీద బయటకు తీశారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి మృతదేహాలను తరలించామని మృతుడు సందీప్‌గౌడ్ సోదరుడు అమర్‌నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుల్లో సాయికుమార్ గౌడ్‌కు వివాహమైంది.

# సెల్‌టవర్ రిమోట్ యూనిట్లు దొంగిలించే ముఠా అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీసన్న, స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్, రిమోట్ యూనిట్

నాగార్జునసాగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సెల్‌టవర్లలో ఆర్‌ఆర్‌యూ(రేడియో రిమోట్ యూనిట్), బీబీయూ(బేస్ బాండ్‌యూనిట్)లను దొంగిలిస్తున్న ముఠాను నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను సాగర్ సీఐ భీసన్న వెల్లడించారు. నల్లగొండ జిల్లా పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), హాలియా మండలాలతో పాటు ఏపీలోని నరసరావుపేట పరిధిలో ఉన్న బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ సెల్ టవర్లకు సంబంధించిన 5జీ సిగ్నల్స్ కోసం ఏర్పాటు చేసిన రేడియో రిమోట్ యూనిట్, బేస్ బాండ్ యూనిట్లను తిరుమలగిరి(సాగర్) మండలంలోని జానారెడ్డి కాలనీకి చెందిన జటావత్ మహేష్, జటావత్ నాగేస్, జటావత్ వినోద్ కొంత కాలంగా దొంగిలించి హైదరాబాద్‌లోని నాంపల్లికి చెందిన మాలిక్ అనే వ్యక్తికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కూడా సెల్‌టవర్ల యూనిట్లను విక్రయించడానికి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పెద్దవూర మండలం పోతునూరు టోల్‌గేట్ వద్ద సీఐ భీసన్న, పెద్దవూర ఎస్‌ఐ వీరబాబు వాహన తనిఖీలు చేస్తుండగా నిందితులు పట్టుబడ్డారు. నిందితులను విచారించగా పెద్దవూర మండల పరిధిలో రెండు సెల్ టవర్లు, తిరుమలగిరి(సాగర్) మండలంలో ఒక సెల్ టవర్ల యూనిట్లు, హాలియా మండలంలో ఒక సెల్ టవర్ యూనిట్, ఏపీలోని నరసరావుపేటలో మరో సెల్ టవర్ యూనిట్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నారని సీఐ భీసన్న తెలిపారు. నిందితుల నుంచి సెల్ టవర్ యూనిట్‌తో పాటు, రూ.1.50 లక్షల నగదు, సెల్‌ఫోన్, కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సామాగ్రిని కొనుగోలు చేసిన మాలిక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సాగర్ సీఐ భీసన్న, పెద్దవూర ఎస్‌ఐ వీరబాబు, హెడ్ కానిస్టేబుల్ ఈదయ్య, సిబ్బంది లోకేష్‌రెడ్డి, యాదయ్య, శ్రీకాంత్, వెంకట్రాంరెడ్డిని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

**సాగర్ సమాచారం**

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం | 590.00 అడుగులు |
| టీఎంసీలు | 312.0450 |
| ప్రస్తుత నీటి మట్టం | 523.90 |
| టీఎంసీలు | 156.4832 |
| ఎడమకాల్వకు నీటి విడుదల | 8896 |
| కుడికాల్వకు | 8023 |
| విద్యుత్ కేంద్రం ద్వారా | నిల్ |
| క్రస్ట్ గేట్ల ద్వారా | 0 |
| ఎస్ఎల్‌బీసీ ద్వారా | 1800 క్యూసెక్కులు |
| వరద కాల్వ ద్వారా | 280 క్యూసెక్కులు |
| ఇన్‌ఫ్లో | నిల్ |
| అవుట్‌ఫ్లో | 18,999 క్యూసెక్కులు |
| ఎన్ని గేట్ల ద్వారా | 0 |

**పులిచింతల ప్రాజెక్టు**

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి నిల్వ | 45.77 టీఎంసీలు |
| ప్రస్తుత నీటి నిల్వ | 34.19 టీఎంసీలు |
| పులిచింతలకు నీటి రాక | నిల్ |
| అవుట్‌ఫ్లో | 2000 క్యూసెక్కులు |
| ఎన్నిగేట్ల ద్వారా | నిల్ |

**మూసీ నీటిమట్టం**

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం | 645 అడుగులు |
| టీఎంసీలు | 4.46 |
| ప్రస్తుత నీటి మట్టం | 631.00 అడుగులు |
| టీఎంసీలు | 1.65 |
| ఎన్ని గేట్ల ద్వారా | నిల్ |
| ఇన్‌ఫ్లో | నిల్ |
| అవుట్‌ఫ్లో | 636.97 క్యూసెక్కులు |

## వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తిలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం పురోభివృద్ధిని సాధిస్తుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం తగినని నిధులు కేటాయిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రానికి రెండు కళ్లు అని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసి దేశ చరిత్రలో చరిత్రాత్మక ఘట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200యూనిట్ల ఉచిత కరెంటుతో పాటు పలు పథకాలను అమలు చేసి ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుందన్నారు.

**● కప్పేసిన మంచు దుప్పటి**





నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో రహదారిపై పొగమంచు కమ్ముకోవడంతో ఉదయం 8.30 గంటల సమయంలో లైట్ల వెలుతురులో వెళ్తున్న వాహనాలు

నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రం, శివారు గ్రామాల్లో జాతీయ రహదారిని ఆదివారం పొగమంచు కమ్మేసింది. దీంతో ముందుకెళ్లేందుకు వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. లైట్ల వెలుతురులో హారన్ మోగిస్తూ ముందుకు సాగారు. ఉదయం సుమారు ఏడు గంటల సమయంలో మొదలైన పొగమంచు తొమ్మిది గంటల వరకు ఉండడంతో స్థానికులు ఆశ్చర్యపోయారు. ఇబ్బందికర పరిస్థితి తలెత్తడంతో కొందరు వాహనదారులు రోడ్డు పక్కకు ఖాళీ స్థలంలో నిలుపుకుని పొగమంచు తగ్గాక వెళ్లిపోయారు. స్థానికంగా సర్వీస్ రోడ్డులో వాహనాలు లైట్ల వెలుతురులో వెళ్లినా దారి కన్పించలేదు. జాతీయ రహదారిపై పెద్దకాపర్తి శివారులో ఉన్న గాంధీ గుడిని మంచు దుప్పటి కప్పేసింది.

● ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్

## విప్లవ రచయిత, కవి రావిరాల బుచ్చయ్య మృతి



చిట్యాలరూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తొలితరం విప్లవ రచయితల సంఘం సభ్యుడు, కవి నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన రావిరాల బుచ్చయ్య అనారోగ్యంతో శనివారం రాత్రి హైదరాబాద్‌లో మృతిచెందారు. 1964లో 'చిందు రామవ్వ' అనే నవల రాశారు. 1977లో విముకి పథంలో అనే గ్రంథాన్ని రాశారు. అనేక కథలు, నాటకాలను, టీవీ ఆర్టిస్టుగా, నాటక కర్తగా ప్రసిద్ధి చెందారు. రచయితల సంఘం ఆవిర్భావ సభకు హాజరైన అతికొద్ది మంది సభ్యుల్లో రావిరాల బుచ్చయ్య ఒకరు. నల్లగొండ జిల్లా విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మృతికి పెరుమాళ్ళ ఆనంద్, ఏదుళ్ళ అంజిరెడ్డి, కుకుడాల గోవర్ధన్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, తండు కృష్ణకౌండిన్య, దర్శనం అంజయ్య, మేరెడ్డి యాదగిరిరెడ్డి, సంతాపం తెలిపారు.

# వైభవంగా యాదగిరీశుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు ఆదివారం రాత్రి వేళ కల్యాణ లక్ష్మీనరసింహుడు దివ్య విమాన రథంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగత్ కల్యాణం..విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో పాంచరాత్రాగమన రీతిలో రథోత్సవాన్ని చేపట్టారు. విద్యుత్ దీపాల కాంతులు విరజిమ్ముతుండగా వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా స్వామివారి దివ్య విమానరథాన్ని అలంకరించారు. మండపంలో అర్చకబృందం విష్వక్సేన పూజలతో రథాంగబలి, దిష్టికుంభ పూజలు చేపట్టారు. లక్ష్మీనారసింహస్వామి దంపతులను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై అధిష్టింపజేశారు. అర్చకులు, రుత్వికులు వేద పారాయణాలు, మూల మంత్ర జప పఠనం జరిపి ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ హారతి నివేదనలు చేశారు. కలెక్టర్ ఎం. హనుమంతరావు, ఈవో ఏ. భాస్కర్‌రావు ఆలయ అధికారులు ఇరువైపులా చేరి రథపగ్గాలు లాగగా స్వామివారి దివ్య విమాన రథోత్సవంలో నూతన వధువరులైన లక్ష్మీసమేతులను తిరువీధిలో ఊరేగింపు సేవ చేపట్టారు. రథస్త కేశవుడిని.. దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. ఆగమ శాస్త్రరీతిలో స్వామివారి దివ్య విమాన రథోత్సవ వేడుకల్లో భక్తజనకోటి గోవింద నామస్మరణతో గొంతు కలిపారు. భక్తుల జయ జయ ధ్వానాలతో క్షేత్రం ప్రతిధ్వనించింది. అనంతరం స్వామిఅమ్మవారలను రథంపై నుంచి ఆలయ ప్రవేశం గావించారు. రాత్రి సినీ గాయకురాలు గీతమాధురి భక్తి గీతాలు ఆలపించారు. ఈ వేడుకలను ప్రధానార్చకుడు నల్లందీగళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు అర్చక బృందం పారాయణిక పరివారంతో ఆగమశాస్త్ర రీతిలో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో కలెక్టర్ ఎం.హనుమంతరావు దంపతులు, ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, జూశెట్టి క్రిష్ణ, గజ్వెల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్‌గౌడ్, దీరావత్ రామరావునాయక్, రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు భక్తులు పాల్గొన్నారు.

### గరుడవాహనంపై కల్యాణ లక్ష్మీనృసింహుడు

విశ్వకల్యాణమే పరమార్థంగా కల్యాణమూర్తులు యాదగిరి లక్ష్మీనరసింహులు తొమ్మిదో రోజు ఆదివారం వెండి గరుడ సేవలో భక్తులు దివ్య దర్శనం పొంది తరించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో శనివారం వైభవంగా జరిగిన కల్యాణోత్సవ వేడుకల్లో లక్ష్మీసమేతుడైన స్వామివారిని విష్ణుమూర్తి అలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరమైన అలంకార మూర్తి నార్సింహుడు తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై అధిష్టించి వేరి మహాలక్ష్మి అమ్మవారి సమేతంగా తిరువీధుల్లో ఊరేగారు. అలంకార శోభితులైన లక్ష్మీనృసింహులు వేద స్వరూపుడైన వెండి గరుడ వాహనంపై అధిష్టించగా వేద పండితులు, పారాయణికులు వెంట రాగా మంగళవాయిద్యాలు భక్తుల జయ జయ ధ్వానాల మధ్య మండపంలో ఊరేగించి సేవించారు. గరుడ వాహనం దోసిళ్లలో బంగారు దివ్య విమాన రాజగోపురం పొదిగినట్లు అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆలయంలో ఉదయం జరిగిన ఈ వేడుకల్లో కలెక్టర్ ఎం. హనుమంతరావు, ఈవో ఏ. భాస్కర్‌రావు పాల్గొన్నారు.



రథోత్సవంలో డోలు వాయిస్తున్న కళకారులు



గరుడ వాహన సేవలో కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు, అధికారులు, అర్చక బృందం

**బ్రహ్మోత్సవాల్లో నేడు**

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం మహా పూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం నిర్వహించనున్నారు. సాయంత్రం పుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవాలు చేపట్టనున్నారు.



తిరువీధి సేవ ముందు కళాకారుల నృత్య ప్రదర్శన

### అలంకరణ..వాహన సేవ విశిష్టత

సృష్టికి విష్ణుమూర్తి సర్వాధికారి. మహావిష్ణు సర్వ వ్యాప్తి తత్వమని, ఆతత్వం విశ్వమంతట వ్యాపించి సమస్త జీవుల కర్మ ఫలాలను అనుసరించి ఫలితాలను అంద జేస్తూ సంరక్షించు తత్వమే విష్ణుతత్వం. వేద స్వరూపుడు పర మాత్మ వేదాత్మకుడైన గరుడ వాహన సేవలో భక్తకోటికి దర్శన భాగ్యం కలిగించుట ప్రత్యేకం. వైష్ణవ సంప్ర దాయం లో గరుడుడికి (పెరియ తిరువడి) గొప్ప దాసుడు. స్వామి వారి చెంత నుంటూ దాసుడు, సఖు డు, వాహనం, ఆసనం ఇలా అనేక కైంకర్యాల్లో గరుడికి ప్రత్యేక స్థానం ఉంది. గరుడ వాహనరూఢుడైన స్వామివారి దర్శనం వల్ల సర్ప, జ్వరాది బాధలు నశించి, ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతోందని సూచిస్తోంది.

**రథోత్సవ విశిష్టత**

రథరూఢులైన లక్ష్మీనరసింహ స్వామిని దర్శించిన జన్మ రాహిత్యం, మనోరథ సిద్ధి అందివ్వగలదని రథోత్సవం సూచిస్తోంది. సర్వ ఉపనిషత్సారం, సర్వవేదసారం, సర్వమంత్ర, యంత్ర, తంత్ర స్మృతిసారం, అంతరార్థం కలిగింది రథోత్సవ వేడుక సర్వ సంపతకరమని, మోక్ష సిద్ధి ప్రాప్తిస్తోందని వేదోక్తి. రథం శరీరం పురుషస్య అంటూ దేహం రథమని ఇంద్రియాలు అశ్వాలని వాటి పగ్గాలను బిగబట్టి దేహమనే రథాన్ని సుఖమైన మార్గంలో నడిపే వాడుగా జీవుడిని భగవంతుడు రక్షిస్తాడని వేడుకలోని అంతరార్థం.

**ఆకట్టుకున్న సంగీత సభలు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన ధార్మిక, సాహిత్య, సంగీ సభలు వైభవంగా కొనసాగుతున్నాయి. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అనుశ్రీ ఈవెంట్స్ (హైదరాబాద్) సంగీత విభావరి, స్వామివారి రథం ముందు లక్ష్మీనరసింహ స్వామి భజన (షాపల్లి) మండలి చెక్కభజన, వెంకట అన్నమాచార్య తెలం గాణ ట్రస్ట్ కోలాట నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కాగా, ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకు లక్ష్మీ శ్రీనివాస భజన (హైదరాబాద్) మండలి, 6.45 నుంచి 7.30 గం టల వరకు యాదాద్రి భజన సేవా (యాదగిరిగుట్ట) సమితి, 7.30 నుంచి 8.10 గంటల వరకు శబరి గిరీశ, అయ్యప్ప (కార్వాన్) భక్త బృందం భజన కార్యక్రమాలు, 8.10 నుంచి 8.30 గంటల వరకు ఆస్థాన విద్వాంసుల మంగళవాద్యం, 8.30 నుంచి 9 గంటల వర కు ఆస్థానపరంగా వైదిక ప్రార్థన, 9 నుంచి 10.30 గంటల వరకు అమరవాది వెంకట నరసింహచార్య స్వామి (హైద రాబాద్) నరసింహ అవతారంపై ఉపన్యాసం, 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భాగవతారిణి విజయవల్లి భరద్వాజ్ (హైదరా బాద్) గజేంద్ర మోక్షం హరికథగానం, మధ్యాహ్నం 12 నుంచి 12.40 గంటల వరకు కుమారీ ఈదుల కంటి వీణ, స్వతంత్ర కృష్ణ బృందం (యాదగిరిగుట్ట), 12.40 నుంచి 1.30 గంటల వరకు మంజులా డాన్స్ అకాడమీ (హైదరాబాద్) కూచిపూడి నృత్య ప్రదర్శన, వెంకట అన్నమా చార్య ప్రాజెక్టు బృందం (హైదరాబాద్) ఉదయం నుంచి సాయంత్ర వరకు సేవ ముందు కోలాట నృత్యం, సాయంత్రం 4 నుంచి 4.45 గంటల వరకు వాగ్దేవి మ్యూజిక్ అకాడమి (హైదరాబాద్) భక్తి సంగీతం, 4.45 నుంచి 5.30 గంటల వరకు వైష్ణవి గోపాల్ బృందం (హైదరాబాద్) వీణావాద్యం, 5.30 నుంచి 6 గంటల వరకు కాసర్ల విశ్వ జ ప్రసాద్, విష్ణుజ (హైదరాబాద్) కూచిపూడి నృత్యం ప్రదర్శన అనంతరం ఒగ్గు శ్రీనివాస్ (మల్లాపురం) ఒగ్గుకథ, గడ్డం సుదర్శన్ (యాదగిరిగుట్ట) చిందు యక్షగానం ఆకట్టుకున్నాయి.

# వేసవికి ముందే వెతలు



నల్లగొండ జిల్లాలో ఎండిన పొలంలో పశువులు మేపుతున్న రైతులు

(5వ పేజీ తరువాయి)

ఫిబ్రవరిలో సేకరించిన వివరాల ప్రకారం జిల్లాలో సగటున 7.74మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. చాలా మండలాల్లోనైతే 10మీటర్ల లోతు వరకు కూడా నీటిమట్టాలు పడిపోవడం గమనార్హం. మరికొన్ని మండలాల్లోనైతే ప్రమాద ఘంటికలు కనిపిస్తున్నాయి. దామరచర్ల మండలంలో 15.94మీటర్లకు పడిపోగా, నాంపల్లిలో 12.88మీటర్లు, డిండిలో 12.59మీటర్లు, చిట్యాలలో 11.59మీటర్లు, చింతపల్లిలో 11.32మీటర్లు, మర్రిగూడ 10.98మీటర్లు, కట్టంగూరులో 10.43, మునుగోడు 10.47మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఈ ఏడాది జనవరి నెలతో పోలిస్తే ఒక నెలలోనే మీటర్ లోతుకు నీటిమట్టాలు. జనవరిలో జిల్లాలో సగటున 6.82మీటర్లు కాగా ఫిబ్రవరి నెలాఖరు నాటికి 7.74మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. డివిజన్‌లవారీగా పరిశీలిస్తే నల్లగొండ డివిజన్ పరిధిలో 12మండలాల్లో సగటున నీటిమట్టం జనవరిలో 7.43మీటర్లు ఉండగా, ఫిబ్రవరిలో 8.59మీటర్ల లోతుకు నీటిమట్టాలు పడిపోయాయి. దేవరకొండ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో జనవరిలో సగటున 7.82మీటర్లుగా ఉండగా, ఫిబ్రవరిలో 8.44మీటర్ల లోతుకు పడిపోయింది. మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో జనవరిలో 6.18 మీటర్లు ఉండగా ఫిబ్రవరిలో 6.23లోతున నీటిమట్టం ఉంది. మిర్యాలగూడ డివిజన్‌లో కొన్ని మండలాల్లో ఆందోళన పరిస్థితులు ఉండగా, మరికొన్ని మండలాల్లో మాత్రం భూగర్భజలాలు అందుబాటులో ఉండటం కొంత మేరకు ఊరట అని చెప్పవచ్చు.

### గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే 3.60 మీటర్లు తగ్గిన జలాలు

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 9(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా జిల్లాలో వర్షాలు ఈ ఏడాది ఆశించిన మేర కురవలేదు. దీంతో భూగర్భజలాలు అడుగంటాయి. గతంతో పోలిస్తే జిల్లావ్యాప్తంగా వర్షాలు తక్కువగా కురిశాయి. కొన్నేళ్ల క్రితం భూగర్భజలాలు జిల్లాలో ఆశాజనకంగా ఉన్నాయి. వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు వృద్ధి చెందలేదు. ప్రభుత్వం నిరంతరాయంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తుండడంతో కొంతమేర భూగర్భ జలాలు అడుగంటిపోవడానికి కారణంగా తెలుస్తోంది. రైతులు వ్యవసాయ మోటార్లకు బిగించిన ఆటోమెటిక్ స్టార్టర్లను పూర్తిస్థాయిలో తొలగించలేదు. వానాకాలం, యాసంగిలో సాగు చేసిన వరి, ఇతర పంటలకోసం రైతులు బావులు, బోర్లకు బిగించిన మోటార్లను నిరంతరం వినియోగిస్తున్నారు. దీంతో భూగర్భజలాలు తగ్గిపోయాయి. ఈఏడాది మాత్రం జిల్లాలో యాసంగిలో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ముందుగా రావడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, మూసీ ప్రాజెక్టులు నిండిపోయాయి. దీంతో జిల్లాలోని ఆయా ప్రాంత రైతుల విన్నపం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదలచేశారు. దీంతో వానాకాలంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులు వివిధ రకాల పంటలు సాగుచేశారు. కానీ యాసంగిలో మాత్రం ఆరుతడి పం టలు సాగు చేయాలని సూచించారు. రైతులు మాత్రం ఎక్కువగా వరి పంటను సాగు చేశారు. దీంతో నీటి వినియోగం పెరిగింది. వ్యవసాయ శాఖ వారి అంచనాల ప్రకారం జిల్లాలో యాసంగి సీజన్‌లో వివిధ రకాల పంటలు కలిపి సుమారు 5లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు సమాచారం. కాగా అందులో ఎక్కువగా నాలుగున్నర లక్షల ఎకరాలకు పైగా వరిని సాగు చేశారు.

### సూర్యాపేట జిల్లాలో తగ్గిన భూగర్భజలాలు

జిల్లాలో భూగర్భజలాలు తగ్గాయి. గతేడాదితో పోలిస్తే జిల్లావ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో భూగర్భజలాలు వృద్ధి చెందలేదు. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది వర్షాలు ముం దుగా కురిశాయి. సూర్యాపేట జిల్లాలో సగటు నీటి మట్టం 8.30 మీటర్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఏడాదిలో పలు నెలల్లో మాత్రం నీటి మట్టం పెరిగింది. జిల్లాలో గతేడాది ఫిబ్రవరిలో 2.31మీటర్లు ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో 5.97 మీటర్లకు పడిపోయింది. ప్రతీ నెల భూగర్భజలాలు కిందికి పడిపోతున్నాయి. జిల్లాలో చింతలపాలెం మండలంలో 12.07మీటర్లు, అర్వపల్లి మండలంలో 10.23 మీటర్లు, తిరుమలగిరి మండలంలో 17.02 మీటర్లు, ఆత్మకూర్(ఎస్) మండలంలో 9.98 మీటర్లు లోతులో భూగర్భజలాలు ఉన్నాయి.

### ఆయకట్టు పరిధిలో రైతుల ఇబ్బందులు

మూసీ, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ఆయకట్టులో పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యాసంగిలో సాగు చేసిన పంటలు సుమారు 10 నుండి 20 రోజుల్లో కోతకొచ్చే పరిస్థితి ఉంది. కానీ ప్రాజెక్టుల నుంచి నీళ్ల రాకపోవడంతో వరి పొలాలు ఎండిపోతున్నాయి. జిల్లాలో యాసంగిలో ఎస్సారెస్పీ ఆయకట్టు కింద లక్షా 8ఎకరాలు, మూసీ ఆయకట్టు కింద సుమారు 10వేల ఎకరాలు, నాగార్జునసాగర్ ఆయకట్టు కింద లక్షా 75వేల ఎకరాల్లో పంటలు సాగుచేశారు.

### తాగునీటికీ తప్పని ఇబ్బందులు

వేసవిలో జిల్లాలో తాగునీటికి కూడా ఇబ్బందులు కలిగే అవకాశాలు కనబడుతున్నాయి. వేసవిలో నీటికి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ సందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఇప్పటికే ఆదేశించారు. బోరుబావుల్లో నీళ్ల లేకుండా పోయాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**భూగర్భ జలాలు పడిపోయిన తీరు ఇలా.. మీటర్లలో..**

| మండలం | ఫిబ్రవరి 2024 | ఫిబ్రవరి 2025 | పడిపోయిన లోతు |
|---|---|---|---|
| అడ్డగూడూరు | 4.45 | 4.98 | -0.53 |
| చౌటుప్పల్ | 5.83 | 6.18 | -0.36 |
| బి.పోచంపల్లి | 5.37 | 6.31 | -0.94 |
| వలిగొండ | 6.67 | 8.56 | -1.89 |
| యాదగిరిగుట్ట | 7.92 | 8.90 | -0.98 |
| గుండాల | 7.23 | 9.24 | -2.01 |
| మోత్కూరు | 9.30 | 10.27 | -0.98 |
| రాజపేట | 8.41 | 10.44 | -2.03 |
| మోటకొండూరు | 9.57 | 11.36 | -1.79 |
| ఎం.తుర్కపల్లి | 10.69 | 11.76 | -1.07 |
| ఆలేరు | 8.22 | 11.96 | -3.74 |
| బీబీనగర్ | 10.14 | 12.31 | -2.17 |
| రామన్నపేట | 9.92 | 12.36 | -2.44 |
| భువనగిరి | 8.34 | 12.61 | -4.28 |
| బొమ్మలరామారం | 11.15 | 14.06 | -2.91 |
| ఆత్మకూరు(ఎం) | 13.87 | 18.18 | -4.31 |
| ఎస్.నారాయణపూర్ | 13.25 | 23.09 | -9.84 |
| జిల్లా సగటు | 8.59 | 10.95 | -2.36 |

**యాదాద్రి జిల్లాలో పడిపోయిన భూగర్భజలాలు**

యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ యేడాది భారీ వర్షాలు కురవక చెరువులు, కుంటలు నిండలేదు. వాగులు, వంకలు పారలేదు. దీంతో భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నాయి. ఎండలు ముదురుతుండటంతో జిల్లాలో భూగర్భజలాలు రోజుకింత కిందకు పడిపోతున్నాయి. గత యేడాది ఫిబ్రవరితో పోల్చితే ఈ ఫిబ్రవరి చివరి నాటికి జిల్లాలో సగటున అదనంగా 2.36మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. దీంతో బావులు, బోర్లలో నీరు లభించక వేసిన పంటలు ఎండిపోతున్నాయి. గత సంవత్సరం ఫిబ్రవరితో పోల్చితే ఈసారి జిల్లాలో సంస్థాన్‌నారాయణపురం మండలంలో అత్యధికంగా 9.84 మీటర్లు అదనపు లోతుకు పడిపోగా చౌటుప్పల్‌లో తక్కువగా 0.36 మీటర్లు అదనపు లోతుకు పడిపోయాయి.

**తక్కువ నీటితో సాగయ్యే పంటలు వేయాలి**

జిల్లాలో భూగర్భ జలమట్టాలు పడిపోతున్నందున రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటలను వేయాలి. రైతులు పంటల మార్పిడి పద్ధతిని అవలంభించాలి. జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నాటికి 7.74మీటర్లకు భూగర్భజలాలు పడిపోయినందున రైతాంగం నీటిని వృథా చేయవద్దు. నివాస, వ్యవసాయ బోరుబావులు మినహా పారిశ్రామిక, మైనింగ్, బల్క్ వాటర్ సప్లయ్ ప్యాకేజీలు డ్రింకింగ్ కోసం బోర్లు వేసుకున్న వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. గృహాలు, వ్యవసాయ క్షేత్రంలో బోరు బావులు తవ్వుకునే వారు తహసీల్దార్, బోరుబండ్ల యజమానులు భూగర్భ జలవనరుల కార్యాలయంలో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.

- రేవతి, భూగర్భ జలవనరుల శాఖ అధికారి, నల్లగొండ

## ఎండుతున్న వరి పంట

(5వపేజీ తరువాయి)

చుక్కనీరు రాకపోవడంతో పంటకు పెట్టిన పెట్టుబడితోపాటు ఆ పంటను కాపాడుకోవడానికి మళ్లీ అప్పు చేస్తే, అప్పు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

**నీరు అందకుంటే తీవ్ర నష్టం**

గత సంవత్సరం 10 ఎకరాలు సాగైంది. ఈ సంవత్సరం ఎనిమిది ఎకరాలు సాగు చేశాను. పంట పొట్టకు వచ్చింది. మూడు ఎకరాలు కూడా పారడం లేదు. దేవాదుల ద్వారా నీరందిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

-మలిపెద్ది సోమిరెడ్డి, సీతారాంపురం

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో
# నాలుగు నల్లగొండకే

(5వ పేజీ తరువాయి)

కేతావత్ శంకర్‌నాయక్ కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించారు. శంకర్‌నాయక్ తండ్రి వీర్యానాయక్ సైతం దిలావర్‌పూర్ సర్పంచ్‌గా పనిచేశారు. ఈ ప్రభావంతో చిన్నప్పటి నుంచే రాజకీయాలపై మక్కువ కలిగిన శంకర్‌నాయక్ అంచలంచెలుగా ఎదిగారు. విద్యాభ్యాసం పూర్తయినప్పటి నుంచి స్థానిక రాజకీయాల్లోకి ప్రవేశించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడి నుంచి మొదలుపెట్టి ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగే వరకూ తన రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ ఏదో ఒక పదవి నిర్వర్తిస్తూ వచ్చారు. తొలుత మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రజాప్రతినిధిగానూ తనదైన ప్రత్యేకతను చాటుతూ వచ్చారు. ఉమ్మడి దామరచర్ల మండలానికి 2001లో జనరల్ స్థానం నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. ఆ తర్వాత 2006లో స్వగ్రామం నుంచి ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికవడంతోపాటు, జనరల్ స్థానంలోనే మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అదే క్రమంలో తిరిగి 2014లో మళ్లీ జనరల్ స్థానం నుంచే జడ్పీటీసీగా గెలుపొందారు. ఇలా మూడు పర్యాయాలూ జనరల్ కేటగిరీ నుంచే బరిలో నిలిచి గెలుపొంది సత్తాచాటారు. అదే స్ఫూర్తితో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2009, 2014, 2018, 2023 ఎన్నికల్లోనూ మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించినా, కీలకనేతల ఆశీస్సులున్నా అప్పటి సమీకరణాల నేపథ్యంలో టిక్కెట్ దక్కలేదు. జడ్పీలో తనకు సమకాలికులైన బాలూనాయక్, చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యేలుగా రాణిస్తున్న క్రమంలో కొంత మదనపడిన సందర్భాలూ ఉన్నాయని, అన్నింటికీ ఓర్చుకొని పార్టీకి విధేయుడిగా ఉన్నందువల్లే ప్రస్తుతం అధిష్ఠానం ఈ అవకాశమిచ్చిందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. సమీప బంధువైన దివంగత ఎమ్మెల్యే డి.రాగ్యానాయక్ స్ఫూర్తితో రాజకీయాల్లో కొనసాగించిన శంకర్‌నాయక్ అదే సమయంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి ప్రియశిష్యుడిగా పేరుగాంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో జానారెడ్డి అనుచరవర్గమంతా ఎమ్మెల్యే భాస్కర్‌రావు సహా బీఆర్‌ఎస్‌లోకి వెళ్లినా శంకర్‌నాయక్ మాత్రం జానారెడ్డినే అంటిపెట్టుకొని ఉండడం ఆయనకు మరింత సన్నిహితుడిగా మార్చిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. యువజన నాయకుడి నుంచి కాంగ్రెస్ కార్యక్రమాల్లో, ప్రజాప్రతినిధిగానూ చురుగ్గా పనిచేస్తున్న క్రమంతోపాటు, పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో, అప్పటి అధికార పార్టీ నుంచి అవకాశాలిస్తామనే పిలుపునిచ్చినా వాటిని తిరస్కరించి కాంగ్రెస్‌లోనే కొనసాగిన నేపథ్యంలో జిల్లా దిగ్గజనేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డికీ శంకర్‌నాయక్ సన్నిహితులయ్యారు. ఈక్రమంలోనే విభజన తర్వాత అతి పెద్ద జిల్లాగా మారిన నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా శంకర్‌నాయక్‌కు అందరి ఆమోదంతో అవకాశం ఇచ్చారు. 2019లో డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన శంకర్‌నాయక్ అప్పటినుంచి ఇప్పటివరకు జిల్లా నాయకులందరికీ తలలో నాలుకలా ఉంటూ తనదైనశైలిలో అందరినీ సమన్వయం చేస్తూ వస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక వచ్చిన హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ చీఫ్ ఎలక్షన్ ఏజెంటుగా శంకర్‌నాయక్ వ్యవహరించడం ఉమ్మడి జిల్లా నేతలందరితో ఆయనకున్న సాన్నిహిత్యాన్ని తెలియజేస్తోంది. ఇదే క్రమంలో ఇప్పుడు నేతలందరి ఏకాభిప్రాయంతో శంకర్‌నాయక్ ఎమ్మెల్సీ పదవికి ఎంపికయ్యారని, ఇకముందు కూడా ఇదే శైలిలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలమన్ననలు అందుకోవాలని కాంగ్రెస్‌శ్రేణులు ఆకాంక్షిస్తున్నారు.

### తెలంగాణ ఉద్యమనేతగా దయాకర్‌కు ప్రత్యేక గుర్తింపు

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు ఎస్ మండలం నెమ్మికల్‌కు చెందిన డాక్టర్ అద్దంకి దయాకర్ విద్యార్థి దశ నుంచి చురుగ్గా ఉండేవారు. సామాన్య దళితకుటుంబానికి చెందిన దయాకర్ కష్టపడి చదువుకొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో దయాకర్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా ఉండి విద్యార్థి జేఏసీ నాయకుడిగా ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. జేఏసీలో క్రియాశీలకవక్తగా పేరు సాధించడంతో పాటు, విద్యార్థి జేఏసీకి కన్వీనర్‌గానూ పనిచేసి ఉద్యమంలో ముందంజలో ఉండిపోరాడారు. ఉద్యమ సందర్భంలో పెద్దసంఖ్యలో కేసులు ఎదుర్కొన్నారు. పలు సందర్భాల్లో లాఠీ దెబ్బలు సైతం తిన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కాంగ్రెస్‌లో చేరిన అద్దంకి దయాకర్‌కు 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం టిక్కెట్ కేటాయించింది. ఆ ఎన్నికలో దయాకర్ 2,379 ఓట్ల తేడాతో గాదరి కిషోర్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత పీసీసీ ప్రధాన కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. తిరిగి 2018 ఎన్నికల్లోనూ గాదరి కిషోర్‌కుమార్ చేతిలోనే 1,847 ఓట్ల తేడాతో సీటుని చేజార్చుకున్నారు.

● దయాకర్ కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచి రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ఆయన టీవీ చర్చల్లో పాల్గొంటూ కాంగ్రెస్ వాణిని సమర్థవంతంగా వినిపించే వారు. 2018 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీలో టికెట్ కోసం తీవ్రంగా పోటీపడ్డారు. ఆనాడు డాక్టర్ వడ్డెపల్లి రవి, అద్దంకి దయాకర్‌లో టికెట్ ఎవరికి ఇవ్వాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం తేల్చుకోలేక చివరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అప్పగించారు. రాహుల్ గాంధీ వారిద్దరిని ఢిల్లీకి పిలిపించి స్వయంగా మాట్లాడి దయాకర్‌కే తుంగతుర్తి కాంగ్రెస్ టికెట్ ఖరారు చేశారు. అప్పుడు వడ్డెపల్లి రవి రెబెల్‌గా పోటీ చేయడంతో దయాకర్ రెండో సారి బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడి పోయారు. 2023 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్ వస్తుందని ఆశించారు. మాల, మాదిగ సామాజిక వర్గాల్లో మాదిగ సామాజిక వర్గానికి టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం భావించడంతో ఆ ఎన్నికల్లో దయాకర్‌కు టికెట్ దక్కలేదు.

● ఆ తర్వాత మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఎన్నికల ప్రచార సభలో అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలు వివాదస్పదమవడం, ఆ సమయంలో పార్టీ షోకాజ్ నోటీసులివ్వగా, ఆతర్వాత ఆయన ఆ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవడంతో పాటు, ఆ నేతలకు బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. 2023 ఎన్నికల్లో దయాకర్‌కు టిక్కెట్ నిరాకరించిన అధిష్ఠానం ఆయన స్థానంలో మందుల సామేల్‌కు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించింది. ఆ సమయంలో అధిష్ఠానం ముఖ్యనేతలిచ్చిన హామీ మేరకు దయాకర్ ఆ ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి కృషి చేశారు. ఆ తర్వాత రాజ్యసభ ఎన్నికల సమయంలో దయాకర్‌కు అభ్యర్థిత్వం ఇస్తారని భావించినా సమీకరణాల్లో అవకాశం చేజారగా, తాజాగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానానికి దయాకర్‌ను ఎంపిక చేసి అధిష్ఠానం ఆయన విధేయతకు అవకాశమిచ్చింది.

### కాంగ్రెస్ మిత్రపక్షం

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ మిత్ర పక్షం సీపీఐ అభ్యర్థిగా ఆ పార్టీ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. సత్యం స్వస్థలం నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం ఎలగలగూడెం గ్రామం కాగా, విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలంతో పెనవేసుకుపోయారు.

### దాసోజు శ్రవణ్ కూడా నల్లగొండ బిడ్డే

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన దాసోజు శ్రవణ్‌కుమార్ నల్లగొండ పట్టణానికి చెందినవారు. పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన దాసోజు శ్రవణ్ బాల్యమంతా ఇక్కడే గడిచింది. శ్రవణ్ తండ్రి ఇక్కడే ఉద్యోగిగా పనిచేసేవారని, శ్రవణ్ ఇంటర్ వరకు ఇక్కడే చదువుకున్నారు.

### సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవం : కేతావత్‌శంకర్‌నాయక్

కాంగ్రెస్ అతిసామాన్య కార్యకర్తగా ఉన్న నాలాంటి గిరిజన బిడ్డకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పార్టీ విధేయతకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. నాకు ఈఅవకాశం ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలందరికీ కృతజ్ఞతలు.

**● శంకర్‌నాయక్ బయోడేటా:**

- పేరు : కేతావత్ శంకర్‌నాయక్
- తండ్రి: వీర్యానాయక్ (మాజీ సర్పంచ్)
- కులం: ఎస్టీ (లంబాడ)
- స్వగ్రామం: కేతావత్‌తండా, దిలావర్‌పూర్ (పోస్టు), దామరచర్ల మండలం
- విద్యార్హత: బీఏ
- రాజకీయపదవులు: రెండుపర్యాయాలు జడ్పీటీసీ సభ్యుడు, ఒక పర్యాయం ఎంపీపీ పదవి
- మండలకాంగ్రెస్ అధ్యక్షుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

**అద్దంకి దయాకర్ బయోడేటా**

- పేరు : అద్దంకి దయాకర్
- తండ్రిపేరు: రామలచ్చు
- స్వగ్రామం: నెమ్మికల్, ఆత్మకూరు(ఎస్) మండలం, సూర్యాపేట జిల్లా
- కులం: ఎస్సీ (మాల)
- విద్యార్హతలు: ఎంకాం,ఎంసీఏ, పీహెచ్‌డీ
- రాజకీయప్రస్తానం: ఓయూ విద్యార్థి జేఏసీ ఛైర్మన్‌గా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర
- తుంగుతుర్తి నియోజకవర్గం నుంచి 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ, స్వల్పతేడాతో ఓటమి, ప్రస్తుత కాంగ్రెస్ అధికార ప్రతినిధి.

## కులవృత్తిదారులకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే వేముల వీరేశం




సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కులవృత్తి చేసుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించిన కులవృత్తిదారుల సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కులవృత్తులపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందజేస్తుందని తెలిపారు. సంఘాలు సంఘంలోని సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగిళ్ల లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు పోకల రమేష్, గౌరవ సలహాదారుడు దౌలాతాబాద్ వాసుదేవశర్మ, సభ్యులు ఎద్దులపురి కృష్ణ, అమరోజు వెంకటేశం, దాసరి స్వామి, సిలివేరు శేఖర్, జిట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ రోడ్డు త్వరగా పూర్తిచేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



ఎల్లారెడ్డిగూడెంలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న తుమ్మల వీరారెడ్డి

నార్కట్‌పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో నత్తనడకన సాగుతున్న సర్వీస్ రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై సీపీఎం చేపట్టిన ప్రజాపోరులో భాగంగా ఆదివారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో పర్యటించారు. గ్రామంలో సర్వీస్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఫీట్ల వెడల్పు చేయాల్సిన సర్వీస్ రోడ్డును 12 ఫీట్లు చేస్తున్నారని ఆరోపించారు. అయినా సర్వీస్ రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేయకపోవటంతో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పనుల ఆలస్యంతో తవ్విన గుంతల్లో పడి ముగ్గురు గాయపడినట్లు తెలిపారు. గ్రామంలోని సర్వే నెంబర్ 281లో గల ప్రభుత్వ భూమిని ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఇవ్వాలని వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్మరి శంకర్, దండు రవి, బొల్లెద్దు సైదులు, దండు నాగరాజు, శ్రీను, లింగయ్య, కత్తుల రవి, బొడ్డుపల్లి శంకరయ్య, సూర ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి తుమ్మలపల్లి రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



తుమ్మలపల్లి కొండ పై వెలసిన పార్వతీ రామలింగేశ్వరస్వామి

చండూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామ శివారులోని కొండపై వెలసిన పార్వతీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు ఎంతో అంగరంగ వైభవంగా జరగనున్నాయి. సోమవారం ఉదయం గణపతి పూజ, ధ్వజారోహణం, ఈ నెల 12వ తేదీ బుధవారం రాత్రి ఎదుర్కోళ్లు 13న రోజున పార్వతీ రామలింగేశ్వరస్వామి కల్యాణం, 15శనివారం తెల్లవారితే ఆదివారం రోజున విమాన రథోత్సవం, 16 ఆదివారం తెల్లవారితే సోమవారం రోజున అగ్ని గుండాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అదే విధంగా పది రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు వివిధ గ్రామాల నుంచి భక్తులు హాజరు కానున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని వసతులు సమకూర్చుతామని దేవాలయ కమిటీ ఛైర్మన్ గుర్‌రెడ్డి రమ్య రామలింగారెడ్డి, ఈవో నాగిరెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు.

## ఇరుకు రోడ్డుతో ప్రజల ఇబ్బందులు

● పలుసార్లు ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు



డ్రైనేజీ కాల్వలో పడిన కారును తీస్తున్న యువకులు

పబ్లిక్ డిమాండ్
PUBLIC DEMAND

మర్రిగూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇరుకు రోడ్లతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగినా అధికారుల పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మర్రిగూడ మండలకేంద్రంలో నక్క రాములమ్మ ఇంటి ముందు నుంచి దుగ్గి శ్రీనివాస్ కిరాణం దుకాణం వరకు ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. ఆ మార్గంలో వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు పెద్ద డ్రైనేజీ ఉండటం వల్ల డ్రైనేజీలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో చర్లగూడ రిజర్వాయర్, నాంపల్లి మండలంలో లక్ష్మణాపురం రిజర్వాయర్ పనులు జరుగుతుండటం వాహనాల రద్దీ పెరుగుతుంది. రోడ్డు వెడల్పుగా లేకపోవడంతో ఇరుకుగా ఉన్నందున రెండు రోజుల క్రితం కారు ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడిపోయింది. కారులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అక్కడ ఉన్న యువకులు రాకపోకలకు అంతరాయం కలుగకుండా కారును బయటకు నెట్టారు. ఇరుకు రోడ్డు వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నార్కట్‌పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు పేర్కొన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రానికి శివారులో ఉన్న శివసాయి కాలనీలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ని మహిళలు కేక్ కట్ చేశారు. కాలనీ సంక్షేమ కమిటీ సభ్యులైన సుభాషిణి, అపర్ణ, జ్యోతి, జ్ఞాన ప్రశాంతి, సుజాత, రాజ్యలక్ష్మి, వసుంధర, రాధికలను ఘనంగా సన్మానించారు.

# ఎండుతున్న పంట పొలాలు




చిట్యాల మండలం పెద్దకాపర్తి వరిచేనుకు ట్యాంకరుతో నీటి నందిస్తున్న రైతు వెంకన్న

వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న రైతులకు ఈ సీజన్ లో పడిన కష్టం నష్టంగా మారేలా ఉంది. పచ్చని పొలాల్లో భూమికి పచ్చని పందిరి వేసినట్లు ఉండే వరి పంటలు భూగర్భజలాలు అడుగంటుతుండటం ఎండిపోయిన పైర్లన్నీ ఎర్రగా పసుపుపచ్చగా మారుతున్నాయి. వ్యవసాయానికి మూలాధారమైన నీరు లేక సాగు చేసిన రైతులకు కన్నీరు మిగులుతోంది. చేసిన కష్టంతో పాటు పెట్టిన పెట్టుబడి కూడా వృథాగా మారుతోంది. కొన్ని చోట్ల సాగు నీరు అందక ఎండుతున్న పొలాలను కాపాడుకునేందుకు కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. అలా చేసినా పూర్తి స్థాయిలో నీరందక పొలాలు ఎండిపోతున్నాయి. పంట చేతికందక పోవడంతో రైతులు వరి కంకులను కోసి గేదెలకు వేస్తున్నారు.పలుచోట్ల పంటలపై ఆశలు వదులుకొని గేదెలకు మేపుతున్నారు.

\- (ఆంధ్రజ్యోతి,చిట్యాలరూరల్)

» అడుగంటిన భూగర్భజలాలు
» ట్యాంకరుతో బతికించుకుంటున్న రైతులు
» ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు



చిట్యాల మండలంలో సుమారు 13,200 ఎకరాల్లో వరిని సాగు చేశారు. నాటు వేసి వరిపైర్లు పెరిగే కొద్దీ రోజురోజుకు నీటిని అందించే మోటార్లు నీటి ధార తగ్గుతూ వస్తుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైనది. వరి కంకులు దాదాపుగా ధాన్యం గింజలుగా మారే సమయంలో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని వనిపాకల, పెద్దకాపర్తి, చిన్నకాపర్తి, వట్టిమర్తితో పాటుగా పలు గ్రామాల్లో వరి చేన్లు నీరందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. నీరందకపోవడంతో ఎండిన పంటను చూసి పలువురు కన్నీరు పెడుతున్నారు. పంటను వదులుకోలేక పలు గ్రామాలకు చెందిన రైతులు పంటలకు నీటిని కొనుగోలు చేసి ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. కానీ అది సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు నీరందించలేక ఆశలు వదులుకున్నారు. మరి కొంద రు రైతులు సాగు చేసిన పంటలో కనీసం 60శాతం పంటనైనా కాపాడుకోవాలని తాపత్రయపడుతున్నారు. దీంతో పచ్చని పొలాలకు నీరందక ఎండి వరి కంకులు ఎర్రగా మారి ఎండిపోతున్నాయి. వ్యవసాయాధికారుల సర్వే ప్రకారం మండలంలో సుమారుగా 520 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిం ది. అనధికారికం గా అంతకు పైగా వరి పంట ఎండిపోయి ఉంటుంది. భూగర్భజలాలు తగ్గడంతో తమ వరి పంటలకు సకాలంలో నీటినందక ఎండిపోయాయని, 24 గంటల కరెంటు కూడా ఇందుకు ఒక కారణమని పలువురు రైతులు పేర్కొంటున్నారు. 24 గంటల కరెంటును తగ్గించి దానిని 18 గంటలు ఇస్తే సకాలంలో కొంత మేర భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

### 24గంటల కరెంటును తగ్గించాలి



వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరాను తగ్గించాలి. 24 గంటల కరెంటు వల్ల రైతులు మోటార్లను ఆన్‌చేసి అలానే ఉంచుతున్నారు. దీంతో భూగర్భజలాలు తగ్గుతున్నాయి. పెద్ద మోటార్లు ఉన్న రైతులకు ఇబ్బందులు లేకుండా సాగు చేసిన పంట కొంత చేతికి వచ్చే అవకాశం ఉండగా చిన్నరైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తన భూమితో పాటు బంధువుల భూమిని కౌలుకు తీసుకొని 12 ఎకరాల్లో సాగుచేయగా సుమారు 8 ఎకరాల వరకు ఎండిపోయింది. మిగిలిన 4 ఎకరాల్లో కూడా ఎంత చేతికి అందుతుంతో తెలియని సరిస్థితి. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాను తగ్గించాలి.

\- నర్రా సత్తిరెడ్డి, రైతు, వట్టిమర్తి

### భూగర్భజలాలలు తగ్గడం వల్లే...



మండలంలోని పలు గ్రామాల్లో వరిచేలు ఎండిపోవడం బాధాకరం. పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గడం వల్లే వరి పంటలు ఎండుతున్నాయి. 13200 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేస్తున్నారు. గ్రామాల్లో భూగర్భజలా ల మట్టం తగ్గిన ప్రాంతంలో సుమారు 520 ఎకరాల్లో వరి చేలు ఎండిపోయినట్లు నిర్ధారించాం.

\- పగిడిమర్రి గిరిబాబు, ఏవో, చిట్యాల



# పేదలకు సేవ చేయడమే లక్ష్యం

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి, చండూరు, మునుగోడు రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవ చేయడమే తన ముందున్న లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి, ఫీనిక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేదలకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మునుగోడు నియోజకవర్గం పరిధిలో మునుగోడు, చండూరు మండలాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడంతో పాటుతో అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేసినట్లు తెలిపారు. కొందరికి శస్త్రచికిత్సలు చేయించినట్లు తెలిపారు. మిగతా మండలాల్లో త్వరలో శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కంటి వైద్యశిబిరానికి వచ్చే వారికి బస్సు, భోజన సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. విడతల వారీగా మండలంలో ఆరు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామం నుంచి వందలాది మంది ఈ శిబిరానికి రావడానికి కృషి చేసిన యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కుంభం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, ఏరెడ్ల రఘుపతిరెడ్డి, పూల వెంకటయ్య, పానగంటి వెంకటయ్య, పెద్దిరెడ్డి రాజు, కొమ్ము బిక్షం, నేతాళ్ల కొండలు తదితరులు పాల్గొన్నారు.



నాంపల్లి: కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

### ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం చండూరులో నిర్వహించిన మార్కండేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉభయ దేవాలయ కమిటీ ఛైర్మన్ రావిరాల నగేష్, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ దోటి సుజాతవెంకటేష్‌యాదవ్, డాక్టర్ కోడి శ్రీనివాసులు, అనంత చంద్ర శేఖర్‌గౌడ్, మంచుకొండ సంజయ్, లింగయ్య, మల్లేశం, వెంకటేశం, వీరేశం పాల్గొన్నారు.

● మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, మాజీ జడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, ఆలయ కమిటీ ఛైర్మన్ మునుకుంట్ల కృష్ణయ్య, బోయ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మార్కండేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

## నేత్రపర్వంగా తిరుమలనాథస్వామి కల్యాణోత్సవం

పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ఎంపీ చామల, ఎమ్మెల్యే వేముల వీరేశం



పట్టువస్త్రాలు, తలంబ్రాలను తీసుకొస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాలరూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో గల భూసమేత తిరుమలనాథస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం స్వామివార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణానికి హాజరైన భక్తులకు దేవిరెడ్డి సత్తిరెడ్డి, సుమతి దంపతుల సౌజన్యంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవానికి సహకరించిన దాతలకు ఆలయ కమిటీ శాలువాలు కప్పి సన్మానించారు. వేసవికాలం కావడంతో కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు ఎల్ఈడీ తెరను ఏర్పాటు చేశారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు ఎండవేడిమి తగలకుండా నిర్వాహకులు చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఓర్సు రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ముద్దసాని సీతరమణారెడ్డి, కాటం వెంకటేశం, ఏర్పుల నర్సింహ, ఏదుళ్ల అజిత్‌రెడ్డి, జెల్ల నర్సింహ, సాగర్ల నాగరాజు, నీలకంఠం లింగస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

## సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

శాలిగౌరారం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి సహకారంతో శాలిగౌరారం మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన లయన్స్ క్లబ్ సేవలు ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించి వైద్య సేవలు అందించడంలో ఎంతో కృషి చేస్తున్నాయని కొనియాడారు. లయన్స్ క్లబ్ వారు వైద్యసేవలకే పరిమితం కాకుండా ప్రజలు, విద్యార్థులకు, మహిళలకు సంబధించిన సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధికి, రోడ్ల మరమ్మతులకు, అన్ని గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ శిబిరంలో దాదాపు 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. 50 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారిలో 20మందిని సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సులో తీసుకెళ్లారు. కార్యక్రమంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి ఛైర్మన్, సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వుప్పల రాజేంద్రప్రసాద్, క్లబ్ రీజనల్ ఛైర్మన్ గుడిపూడి వెంకటేశ్వరరావు, జోన్ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం ఛైర్మన్, దాత చాడ రమేష్ చందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ నరిగె నర్సింహ, క్లబ్ పాస్ట్ జోన్ ఛైర్మన్లు దేవరశెట్టి శ్రీనివాస్, ఎర్ర శంభు లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ సభ్యులు మారం వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటాచారి, వడ్లకొండ బిక్షం, సీఎం రెడ్డి, రాజు వెంకటరామశర్మ, వీరస్వామి, కరుణాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

## చంద్రమౌళి ఆశయ సాధన కోసం కృషి చేయాలి

శాలిగౌరారం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు మారోజు చంద్రమౌళి ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మారోజు చంద్రమౌళి రెండో వర్ధంతి, సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మల్లయ్య మాట్లాడుతూ చంద్రమౌళి చిన్ననాటి నుంచి గ్రామంలో పేదలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి ప్రజలను చైతన్యవంతులను చేశారని అన్నారు. గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. సమావేశంలో నాయకులు తేలుకుంట్ల జగన్, కల్లూరు లింగయ్య, సైదుల శ్రీనివాస్, సంపత్ కుమార్, కరుణాకర్, పరమేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలి

నల్లగొండ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నల్లగొండ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి, పెన్షనర్లకు నగదు రహిత వైద్యసేవలను వెంటనే అమలు చేయాలని కోరారు. అనంతరం 30మంది మహిళా పెన్షనర్లను శాలువాలతో ఘనంగా సన్మానించి, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు మోహన్‌రావు, నాయకులు పుల్లయ్య, సుధాకర్, పీ.రమేష్, కేశవాచారి, శ్రీశైలం, చంద్రకళ, పుష్పలత, పిచ్చమ్మ, లావణ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

● బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు

నల్లగొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో ప్రయోజనం ఉంటుందని, సామాన్య ప్రజల కోసమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆర్‌కెఎస్ ఫౌండేషన్ ఛైర్మన్, బీజేపీ నాయకులు పిల్లి రామరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని 8వ వార్డులోని అక్కలాయిగూడెంలో ఐకాన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే తగిన చికిత్స తీసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. చాలా మందికి వ్యాధులపై అవగాహన లోపం, పేదరికం వల్ల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. సామాన్యులకు ఉచిత వైద్యసేవలు అందించడం కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపునకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శంశాక్ కోడే, శంకర్ ఖన్నా, శశీంద్ర, సాయి మౌనిక, డాక్టర్ కడిమి సాయిలావణ్య, నీలకంఠం సైదులు, రాము తదితరులు పాల్గొన్నారు.




వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

# ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

# నల్లగొండ

5

సోమవారం 10 మార్చి 2025

*** ఇఫ్తార్ : 6.30 | సహర్ : 5.06 (సోమవారం)

**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 60

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.112 | 175 | 200 |
| సూర్యాపేట | రూ.125 | 180 | 210 |
| నల్లగొండ | రూ.125 | 195 | 210 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 | కనిష్ఠం 19.0

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో నాలుగు నల్లగొండకే




- ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్‌నాయక్
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా అభ్యర్థిత్వాలు ఖరారుచేసిన కాంగ్రెస్
- ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యర్థి దాసోజు స్వస్థలం నల్లగొండ
- సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం

రాష్ట్ర రాజకీయాలకు మలుపు కేంద్రంగా మారిన నల్లగొండకే రాష్ట్రంలో అన్ని పార్టీలు ప్రాధాన్యమిస్తున్నాయి. తాజాగా జరుగుతున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐదింటికి నలుగురు అభ్యర్థులు నల్లగొండ జిల్లా వారే ఉన్నారు. అధికార కాంగ్రెస్ ప్రకటించిన ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరు ఉమ్మడి నల్ల గొండ జిల్లాకు అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్‌నాయక్ కాగా, మిత్ర పక్ష సీపీఐ అభ్యర్థిత్వం సైతం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యానికి దక్కింది. వీరితోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యర్థిత్వం దక్కించుకున్న దాసోజు శ్రవణ్‌కుమార్ సైతం నల్ల గొండ బిడ్డే కావడం విశేషం. మొత్తంగా ఏక సమయంలో వేర్వేరు వేదికల ద్వా రా నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు పెద్దల సభకు వెళ్లేందుకు అవకాశం దక్కించుకోవడం ద్వారా జిల్లా ప్రతిష్ఠ ఇనుమడింపజేశారనే చర్చ సాగుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)


2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అతి భారీ మెజార్టీలు అందించిన నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు దళిత, గిరిజన నాయకులను ఏక సమయంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎంపికచేసి పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని పెంపొందించింది. శనివారం ప్రకటించిన ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఇద్దరు నల్లగొండకు చెందినవారే ఉండడం కాంగ్రెస్‌ను మిక్కిలిగా ఆదరించిన నల్లగొండ జిల్లాకు ప్రభుత్వంలోనూ అంతేస్థాయిలో ప్రాధాన్యమిచ్చి, నల్లగొండ గౌరవాన్ని ఇనుమడింపజేసిందనే చర్చ పార్టీ శ్రేణుల్లో సాగుతోంది. శనివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రకటించిన ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌కు అవకాశం దక్కింది. ఈ నేతలిద్దరికీ అవకాశం రావడం పార్టీలో సామాన్య కార్యకర్తలకు లభించిన గౌరవంగా భావిస్తున్నారు.

**సామాన్య కార్యకర్త నుంచి ఎదిగిన శంకర్‌నాయక్**

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కేతావత్ తండాకు చెందిన....

- మిగతా 7వ పేజీలో...

## వేసవికి ముందే వెతలు






పడిపోయిన భూగర్భజలాలు

| జిల్లా | పడిపోయిన నీటిమట్టం(మీ.) |
|---|---|
| నల్లగొండ | 7.74 |
| సూర్యాపేట | 3.60 |
| యాదాద్రి | 2.36 |

జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఫిబ్రవరి, మార్చి రెండో వారంలోనే పరిస్థితులు ఈ విధంగా ఉంటే రాబోయే రోజుల్లో మరింత ప్రమాద ఘంటికలు మోగే అవకాశాలున్నాయి. కొన్ని రోజులుగా అంతకంతకూ నీటి మట్టాలు పడిపోతున్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో సాగునీటికోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండలు తీవ్రమవుతు న్న విషయం తెలిసిందే. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 36.5 నుంచి 37 డిగ్రీలకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతోపాటు భూగర్భజలాలు తగ్గి పంటలకు నీరందడంలేదు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేట(కలెక్టరేట్)

- ఎడిపోతున్న భూగర్భజలాలు
- నాన్ ఆయకట్టులో ఎండుతున్న బోర్లు
- పలు చోట్ల పంటలు ఎండిపోతున్న పరిస్థితులు
- రాబోయే రోజుల్లో మరింత ప్రమాద ఘంటికలు



**నాలుగేళ్లలో నల్లగొండ జిల్లాలో భూగర్భ నీటిమట్టాలు ఇలా..**

| డివిజన్ | ఫిబ్రవరి 2022 | ఫిబ్రవరి 2023 | ఫిబ్రవరి 2024 | ఫిబ్రవరి 2025 |
|---|---|---|---|---|
| నల్లగొండ | 4.85మీటర్లు | 6.05మీటర్లు | 8.52మీటర్లు | 8.59మీటర్లు |
| దేవరకొండ | 6.14మీటర్లు | 5.71మీటర్లు | 10.35మీటర్లు | 8.44మీటర్లు |
| మిర్యాలగూడ | 5.71మీటర్లు | 6.83మీటర్లు | 10.76మీటర్లు | 6.23మీటర్లు |
| మొత్తం | 5.47మీటర్లు | 6.12మీటర్లు | 10.06మీటర్లు | 7.74మీటర్లు |

నల్లగొండ జిల్లాలో ఫిబ్రవరి నెలాఖరు నాటికి జిల్లాలో సగటున భూగర్భజలాలు 7.74మీటర్లుగా నీటిమట్టం నమోదైంది. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రతకు భూగర్భజలాలు మరింత వేగవంతంగా పడిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా నీటిమట్టాలు పడిపోతుండటంతో బోర్లు ఎండిపోవడంతోపాటు ఆగుకుంటూ పోస్తున్నాయి. చేతికొచ్చే ముందు పంటలు ఎండిపోతుండటంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు బోర్లను వేస్తున్నారు. దీంతో రైతులు అటు బోర్లు పడక ఇటు పంటలు ఎండిపోతుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. గత వర్షకాలంలో జిల్లాలో పెద్దగా వర్షాలు కురవక పోవడంతో చెరువులు, కుంటల్లో నీళ్లు లేకుండా పోయాయి. దీంతో భూగర్భజలాలు లేక బోరు బావులపై ప్రభావం చూపుతుంది. గత వానాకాలంలో అడపదడ పా కురిసిన వర్షాలతో పంటలు చేతికొచ్చిన యాసంగిలో మా త్రం కష్టాలు తప్పడంలేదు. వేలాది ఎకరాల్లో వరి పంటలతోపా టు పంటల తోటలు కూడా ఎండిపోతున్నాయి. నీటి ఎద్దడిని ఎదుర్కోవడం కోసం పెద్దఎత్తు న రైతులు బోర్లు వేస్తున్నారు. ఒక్కో రైతు ఏకంగా నాలుగైదు బోర్లు వేస్తున్నప్పటికీ నీటి చుక్క కూడా పడటంలేదు. ఒక్కో బోరుకు సగటున రూ.50వేల వరకు ఖర్చవుతున్నట్లు వాపోతున్నారు. భూగర్భంలో జలాలు లేకపోవడంతో 100అడుగుల లోతు వరకుబోర్లు వేసినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదని తెలుస్తోం ది. జిల్లా భూగర్భ జలవనరుల శాఖ...

- మిగతా 7వ పేజీలో...

### ఎండుతున్న వరి

- పశువులకు మేతగా మారుతున్న పంట
- పంటను కాపాడుకోవడానికి పడరాని పాట్లు
- తలాపున ప్రాజెక్టు ఉన్న పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గుండాల: గుండాల మండలంలో పంటలు ఎండిపోతున్నాయి. నవాబుపేట రిజార్వాయర్‌నుంచి దేవాదుల కాల్వల ద్వారా నీరు అందించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో కాల్వల ద్వారా నీరు అందక పోవడంతో వరి పంట బీటలువారి పశువులకు మేతగా మారుతుంది. కాల్వల ద్వారా నీటిని విడుదల చేసిలోని రైతులు కూడా ఇబ్బందులు పడేవారు. బీర్ల అయిలయ్య చొరవ తీసుకుని నవాబుపేట రిజర్వాయర్ నుంచి దేవాదుల కాల్వ ద్వారా నీరు అందించి మండలంలోని చెరువులు, కుంటలు నింపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పంటను కాపాడాలని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేక సార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గంధమల్ల నుంచి బిక్కేరు వాగులోకి నీరు విడుదల చేయడంతో మండలంలోని అనంతారం, సుద్దాల, బ్రాహ్మణపల్లి, అంబాల, వంగాల, పెద్దపడిశాలకు చెందిన బిక్కేరు వాగు ప్రాంతంలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. లేదంటే బిక్కేరు వాగు ప్రాంతం

**పంటల కోసం నానా తంటాలు..**

ఈ సంవత్సరం మండలం లో వర్షాలు తక్కువగా కురవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. దీంతో వరి సాగు చేసే రైతులు వానాకాలం నుంచే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది గమనించిన రైతులు గత ఏడాదికంటే వరి పంటను తక్కువగా సాగు చేశారు. గత సంవత్సరం యాసంగిలో 15వేల ఎకరాలు సాగు చేస్తే, ఈ సంవత్సరం 12వేల ఎకరాలు మాత్రమే సాగు చేశారు. నీరులేక కళ్ల ముందే చేతికొచ్చే పంట ఎండిపోతుండడంతో కొంత మంది రైతులు పాత బావులు పూడికతీస్తుండగా, మరికొంత మంది రైతులు కొత్తగా బోర్లు వేస్తున్నారు. బోర్లలో....

- మిగతా 7వ పేజీలో...

గుండాల మండలం పాచిల్లలో..



## చూడముచ్చటగా యాదగిరీశుడి రథోత్సవం



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు ఆదివారం కల్యాణ లక్ష్మీనరసింహుడు దివ్య విమాన రథంలో భక్తులకు దర్శనమిచ్చారు. లోకకల్యాణం, విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో పాంచరాత్రాగమరీతిలో రథోత్సవాన్ని చేపట్టారు. విద్యుత్ దీపాల కాంతులు విరజిమ్ముతుండగా వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా స్వామివారి దివ్య విమానరథాన్ని అలంకరించారు. లక్ష్మీనారసింహ స్వామి దంపతులను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై అధిష్ఠింపజేశారు. కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు రథపగ్గాలు ప్రారంభించారు.

7



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

## ఇన్‌సైడ్



**వ్యవసాయ కళాశాల కలేనా?**

వ్యవసాయ పరిశోధన స్థానే కొత్త వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు మంత్రి హామీ

6



**హెచ్‌ఎండీఏ విస్తరణ దిశగా..**

- ఆర్‌ఆర్‌ఆర్ రెండు కిలో మీటర్ల ఆవల వరకు విస్తరణ
- యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో 10 మండలాలు చేరిక
- శివారు ప్రాంతాల్లో అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు

6



**దైవ దర్శనానికి వెళుతూ..**

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఇద్దరి దుర్మరణం, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు
- నార్కట్‌పల్లి మండలంలో ఘటన

6

## ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందిండచమే లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రత్తిపెల్లి గ్రామశివారులో పులిపలుపుల చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లోరైడ్‌పీడిత ప్రాంతమైన మునుగోడు ప్రాంతానికి కృష్ణాజలాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. చెరువు పూర్తిగా నిండితే సమీప గ్రామాల్లో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. కట్టపైనుంచే ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పులిపలుపుల చెరువులోకి నీళ్లు ఎక్కువగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని రత్తిపెల్లి, గంగోత్రి గూడెం, పులిపల్పుల, కలవపల్లి గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, ఉపాధ్యక్షుడు దోటి నారాయణ, జిల్లా నాయకులు వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మాదగోని రాజేష్ గౌడ్, జక్కుల శ్రీనివాస్, పాలకూరి యాదయ్యగౌడ్, జాజుల సత్యనారాయణ, పుట్ట శ్రీనివాస్ రెడ్డి గోపగాని పాపయ్య, బల్గూరి నరసింహ తదితరులు ఉన్నారు.



పులిపల్పుల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

## జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాతీయ సదస్సు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అభివృద్ధి, ఆర్థికపరమైన అంశాలతో కూడిన జా తీయ సదస్సును తొలిసారిగా నియోజకవర్గ కేంద్రంలో ఆవిష్కరించడం గొప్ప విషయమన్నారు. అందుకు కారణమైన కళాశాల అర్థశాస్త్ర విభాగాధిపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దే శ నలుమూలల నుంచి వచ్చే ఉప కులపతులు, నిపుణులకు పట్టణ, పరిసర ప్రాంత విద్యావేత్తలు ఘనస్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ నరేష్ గుమ్మడి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, త్రాసు వెంకటరమణ, వేణు పాల్గొన్నారు.

## ముగిసిన సాగరమాత ఉత్సవాలు

నాగార్జునసాగర్, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఏసు ప్రభువుకు ఎల్లప్పుడు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట రక్షదాయకమని గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నబత్తిని భాగ్యయ్య అన్నారు. నాగార్జునసాగర్ విజయపురిసౌత్(రైట్‌బ్యాంకు)లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మేరిమాత తిరునాళ్ల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమష్టి దివ్యబలి పూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం మాట్లాడారు. పవిత్రాత్మ ప్రభావంతో కన్నె అయిన మేరిమాత గర్భాన దివ్యజ్యోతి అయి ఏసు ప్రభువును ఈ జగతికి ప్రసాదించినట్లు తెలిపారు. పవిత్ర మూర్తి అయిన ఏసుక్రీస్తును స్తుతించుకోవాలన్నారు. ఆధ్యాత్మిక ఆయుధమైన ప్రార్థన, ప్రేమ, నీతి, కరుణ, దయ, క్షమ గుణాలను కలిగిన వ్యక్తులు దేవుని మార్గంలో నడిపించ బడతారని అన్నారు. సాగర మాత మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు దేవుడు ఐశ్వర్యం, ఆయురారోగ్యాలు ప్రసాదించా లని ప్రార్థించారు. ఆదివారం ఉదయం సాగరమాత రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు అత్తలూరు గురువు చాట్ల కస్పాల్‌చే దివ్యబలి పూజ, ఆరు గంటలకు కారంపుడి విచారణ గురువు పెట్ల మర్రి అనిల్, ఏడు గంటలకు ముట్లూరు విచారణ గురువు మార్నేని దిలిప్, ఎనిమిది గంటలకు దాచేపల్లి విచారణ గురువు ఏరువ బాలశౌరి, 10 గంటలకు గుంటూరు పీఠాధిపతి చిన్నబత్తిని భాగ్యయ్యలతో సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరిమాత ఆలయం విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## యువకులు క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎన్‌వీటీ

దేవరకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం అందిస్తానని చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో రెండు రోజులుగా వంద, రెండు వందల మీటర్ల పరుగు పందెం, మ్యాజిగ్ చైన్ గేమ్ పోటీలను నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన క్రీడా పోటీల ముగింపు సమావేశానికి ఆయన హాజరై విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులకు అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, రాపోలు నిరంజన్, సుజాత, కరాటే మాస్టర్ శ్రీను, వైఎస్ కర్నాకర్, సంధ్య, కొండల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మూగ జీవాలను ఆదుకోవాలి

మాడ్గులపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో మూగజీవాలు ఇబ్బందులు పడకుండా ఆదుకోవాలని గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవికాలం దృష్ట్యా ప్రభుత్వం గ్రామాల్లో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటితొట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం నట్టల నివారణ మందులను పంపిణీ చేయకపోవడం వల్ల గొర్రెలు, మేకలు వ్యాధులకు గురవుతున్నాయని, వెంటనే నట్టల నివారణ మందులు వేసి మూగజీవాలను ఆదుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా చేపట్టిన పశుగణన మాదిరిగా రాష్ట్రంలో కూడా పశుగణన చేపట్టి గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లు, మందులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఊరిబండి సైదులుయాదవ్, తగుళ్ల వెంకన్న, నాగరాజు, బోయిన శంకర్, దుర్గయ్య, గంగరాజు, వెంకన్న, కొండయ్య, శంకర్, మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రూరల్‌సీఐగా బాధ్యతలు స్వీకరించిన పీఎన్డీ ప్రసాద్



పీఎన్డీ ప్రసాద్

మిర్యాలగూడ అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పీఎన్డీ ప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ నగరంలో మొగల్‌పూర పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా కొనసాగుతున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వీరబాబు మల్టీజోన్-2 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీపై వచ్చిన సీఐ పీఎన్డీ ప్రసాద్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అక్రమ దందాలను అరికట్టేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు కూడా పోలీసుల సలహాలు, సూచనలను పాటిస్తూ సహకరించాలని ఆయన కోరారు.

## కోతుల బెడద నుంచి రక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్థులు

మాడ్గులపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామంలో కోతుల బెడద నుంచి రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు గ్రామస్థులు మాట్లాడారు. గతంలో తమ గ్రామంలో కోతుల బెడదను తట్టుకోలేక కొండముచ్చును తీసుకొస్తే అది ప్రజలను కరిచి గాయపరచడంతో వేరే గ్రామానికి తరలించామన్నారు. గ్రామంలో కోతులు మనుషులతో పాటు గొర్రెలను, మేకలను తీవ్రంగా కరిచి గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు. సమావేశంలో పోరెడ్డి అప్పారెడ్డి, రంగారెడ్డి, సురేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సైదిరెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా శంకర్‌నాయక్ ఎంపికపై హర్షం



దామరచర్లలో బాణసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

దామరచర్ల, వేములపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌ను ప్రకటించడంపై ఆదివారం రాత్రి ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. మండలంలోని కేతావత్ తండాకు చెందిన కేతావత్ శంకర్‌నాయక్ ఉమ్మడి మండలం నుంచి ఒక దఫా ఎంపీపీ, రెండు పర్యాయాలు జడ్పీటీసీగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతుండగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్ఠానం ఎంపిక చేయడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌ను ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించడంపై వేములపల్లి మండలంలోని శెట్టిపాలెంలో కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో ఆయన చేసిన సేవలు, కృషికి గౌరవంగానే ఎమ్మెల్సీ దక్కిందని అన్నారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, అశోక్, వెంకటయ్య, పుల్లయ్య, వీరయ్య పాల్గొన్నారు.

## యాకూబ్ అలీ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



యాకూబ్‌అలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జానారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

నిడమనూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు మహమ్మద్ యాకూబ్ అలీ మృతి పార్టీకి తీరని లోటని సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని గుంటిపల్లి గ్రామానికి చెందిన నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాకూబ్ అలీ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జానారెడ్డి ఆదివారం పార్టీ నాయకులతో కలిసి గుంటిపల్లిలోని యాకూబ్ అలీ నివాసానికి వచ్చి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందించిన యాకూబ్ అలీ మరణం బాధాకరమని, ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నం చినవీరయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, సిరిశాల మల్లేష్, రూపని కృష్ణయ్య, మేరెడ్డి వెంకట్‌రెడ్డి, సైదాచారి, కట్టా వెంకట్‌రెడ్డి, అక్బర్, జానీ పాషా, గిరి తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనానికి రూ.21వేల విరాళం

దేవరకొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవన నిర్మాణానికి దేవరకొండకు చెందిన చిత్తనూరు పద్మజ రంగయ్య రూ.21,116 విరాళం అందజేసినట్లు దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.నర్సింహ, అంకం చంద్రమౌళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణానికి దాతలు సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పంగునూరి లింగయ్య, దామోదర్‌రెడ్డి, యూసుఫ్, కోటయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

# ఆదాయం ఉన్నా వసతులు సున్నా

» ఇబ్బందులు పడుతున్న క్రయ విక్రయదారులు » పట్టించుకోని అధికారులు



కొండమల్లేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పశువులు, మూగజీవాల క్రమ విక్రయాలకు కొండమల్లేపల్లి సంత పేరుగాంచింది. ప్రతీ ఆదివారం మండల కేంద్రంలో జరిగే సంతకు ఉమ్మడి జిల్లాతో పాటు రంగారెడ్డి, మహబూబ్‌నగర్, పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, దూరప్రాంతాల నుంచి క్రయవిక్రయదారులు కొండమల్లేపల్లి సంతకు వస్తుంటారు. దీంతో వేల సంఖ్యలో మూగజీవాలను తీసుకొని పురుషులు, మహిళలు వస్తుంటారు. సంత నిర్వహణపై వేలం పాట ద్వారా సంవత్సరానికి సుమారు రూ.1.30 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఈ స్థాయిలో ఆదాయం సమకూరుతున్నా సంతలో వసతులు మాత్రం శూన్యం. ఎండాకాలం కావడంతో నిలువ నీడ లేకపోవడంతో అసౌకర్యాల మధ్య సంతకు వచ్చే క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. అన్నిసౌకర్యాలు వసతులు కల్పిస్తామని ప్రతీ ఏడాది చెబుతున్న అధికారులు మాటలతోనే సరిపెడుతున్నారు. నిబంధనల ప్రకారం సంతలో మౌలిక వసతులు కల్పిస్తేనే రైతు నుంచి రుసుము వసూలు చేయాలి. కానీ అదేమీ లేకుండానే పాలకవర్గం అధికారుల ఆదేశానుసారం కాంట్రాక్టర్ ఒక మేకకు రూ.150, ఒక్క పశువుకు వెయ్యిచొప్పున వసూలు చేస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడతో సంతకు వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

### ఆక్రమణకు గురైన సంత భూమి

గతంలో వ్యవసాయ భూమిని లీజుకు తీసుకొని పశువుల సంత నిర్వహించేవారు. 2007లో అప్పటి సర్పంచ్ రమావత్ తారారవికుమార్ పాలకవర్గం సభ్యుల చొరవతో గ్రామపంచాయతీ నిధుల నుంచి సుమారుగా రూ.12 లక్షలు వెచ్చించి పట్టణానికి సమీపంలో మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు నుంచి నల్లగొండకు వెళ్లే బైపాస్ రోడ్డులో చుట్టుపక్కల గ్రామాలకు అనువుగా ఉండే సర్వే నెం.128లో 1.28 ఎకరాల భూమి (దాదాపు రెండు ఎకరాల పట్టా గల భూమిని) ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేశారు. కానీ భూమి చుట్టూ హద్దులు, కంచె ఏర్పాటు చేయకపోవడంతో సమీప వ్యక్తులు కొందరు ఆక్రమించుకొని ఇళ్ల నిర్మించుకున్నారు. ఇదంతా అప్పటి అధికారులు, పాలకవర్గానికి తెలిసినప్పటికి తమకేమీ పట్టనట్లు వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంత భూమిని కొనుగోలు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇద్దరు సర్పంచులు మారినా సంత భూమికి హద్దులు గుర్తించకపోవడం, కంచె ఏర్పాటు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు సంత భూమి సర్వే చేసి కంచె పాతాలని స్థానికులు కోరుతున్నారు.

**సంతలో కావాల్సిన వసతులు**

- » రైతు, క్రయ విక్రయదారులకు తాగునీటి వసతి
- » రైతులు సేదతీరేందుకు షెడ్డు
- » మహిళలు,పురుషులకు వేర్వేరుగా మూత్రశాలలు
- » సంతలో విద్యుత్ సౌకర్యం, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటు
- » సంత ల్యాండ్ సర్వే చేసి చుట్టూ ప్రహరీ నిర్మాణం, పంచాయతీ అధికారుల పర్యవేక్షణ, ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసుల నిఘా.
- » సంతలో చెత్తాచెదారం తొలగింపునకు చర్యలు

**మూగ జీవాలకు తాగునీటి వసతి కల్పించాలి**



కొండమల్లేపల్లి సంతలో తాగునీటి వసతి లేదు. వేసవి కాలం కావడంతో సంతకు వచ్చే రైతులు, వ్యాపారులకు అన్ని రకాల వసతులు కల్పించాలి. మూగజీవాలకు తాగునీటి వసతి కల్పించాలి.

- ఆకనబోయిన నాగయ్య, పార్లపల్లి

**సంతలో షెడ్డు ఏర్పాటు చేయాలి**



వేసవికాలం కావడంతో పశువుల సంతకు వచ్చే క్రయవిక్రయదారులు ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నారు. క్రయవిక్రయదారులు సేదతీరడం కోసం సంతలో షెడ్డు ఏర్పాటు చేయాలి. స్త్రీ, పురుషులకు మరుగుదొడ్లు నిర్మించాలి.

- బోడ అంజి, కొండమల్లేపల్లి

**సంత భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తాం**




తహసీల్దార్‌కు పశువుల సంతకు సంబంధించిన భూమిని సర్వే చేసి ల్యాండ్ డీ మార్కేషన్ ఇవ్వమని అప్లికేషన్ పెట్టాం. త్వరలోనే సంతకు సంబంధించిన భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తాం. సంతకు సంబంధించిన స్థలంలో ఇల్లు నిర్మించారని మా దృష్టికి వచ్చింది. త్వరలోనే చర్యలు తీసుకుంటాం. ప్రతీ ఆదివారం జరిగే సంతలో వసతులపై పై అధికారులతో మాట్లాడి వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

- బాలరాజురెడ్డి, ఎంపీడీవో, కొండమల్లేపల్లి

# నేటి నుంచి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు

- ‘ముప్పారం’ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- హోలీ రోజున స్వామివారి తిరుకల్యాణం
- సల్కునూరు లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు షురూ



ముప్పారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయం (ఇన్‌సెట్‌లో) స్వామివారు

నిడమనూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల పరిధిలోని ముప్పారం గ్రామంలో కొలువైన పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు జరగనున్నాయి. నేటి నుంచి శనివారం వరకు ఆరు రోజుల పాటు ఆలయంలో ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

హోలీ(ఈ నెల 14) పర్వదినం రోజున స్వామివారి కల్యాణం నిర్వహించడం ఇక్కడ మొదటి నుంచి వస్తున్న సంప్రదాయం. స్వామివారి కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ చైర్మన్ యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్లు ఘనపురం సత్యనారాయణ, మర్రి శ్రీను, తాడూరి లక్ష్మయ్య, నాగమ్మ కోరారు.

**కార్యక్రమాలు ఇలా...**

- 10 స్వామివారు చినకోవెల నుంచి పెద్దకోవెలకు ప్రవేశం, తొళక్కం
- 11 ప్రబంధ సేవాకాలం, గరుడసేవ పరమపదోత్సవం
- 12 చాత్మర, అంకురారోహణ
- 13 హోమం, బలిహరణం, గరుడముద్ద
- 14 ఎదుర్కోళ్లు, తిరుకల్యాణం, మహాఅన్నదానం సాయంత్రం అశ్వవాహన సేవ, గ్రామోత్సవం
- 15 పూర్ణాహుతి, స్వామివారి చక్రస్నానం, పుష్పయాగం

**ఆరు రోజులపాటు వైభవంగా బ్రహ్మోత్సవాలు**

గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి ఆరు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల్లో భాగంగా 14న స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరుగుతుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలి.

● యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్

**నేటి నుంచే సల్కునూరు లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు**

వేములపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్కునూరు గ్రామంలో కొలువైన మహిమాన్విత స్వయంభూ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు వేద పండితులు యాజ్ఞాకుల కోమాండూరి తిరుమలచార్యులు, కాటూరి శ్రీధరాచారి తెలిపారు. గ్రామంలోని చిన్న గుడిలోని లక్ష్మీ నర్సింహస్వామిని సోమవారం గ్రామ శివారులో గల పెద్ద కోవెలకు తీసుకెళ్లడంతో ఈ నెల 10వ తేదీన ఉత్సవాలు ప్రారంభమై 18వ తేదీతో ముగియనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలను ప్రతీ ఏడాది మాదిరిగా పది రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ ఉత్సవాలలోని ముఖ్య ఘట్టాలైన లక్ష్మీనృసింహస్వామి చెంచులక్ష్మీ కల్యాణ మహోత్సవం, అనంతరం నిర్వహించే స్వామివారి డేగాట (వసంతోత్సవం)లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.



సల్కునూరులో బండరాయిపై వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి

**కార్యక్రమాలు ఇలా...**

- 10 చిన్న కోవెల నుంచి స్వామివారిని పెద్ద కోవెలకు తరలింపు
- 11 పల్లకి సేవ, ద్రవిడ ప్రబంధ పారాయణం
- 12 పరమపదోత్సవం, గరుడ వాహనంపై గ్రామ సేవ
- 13 విశ్వక్సేన పూజ, పుణ్యహవచనం, అంకురార్పణ హోమం
- 14 గరుడ హోమం, ధ్వజారోహణ
- 15 ఉదయం 5 గంటలకు కల్యాణ మహోత్సవం, గ్రామసేవ
- 16 హోమం, బలిహరణ
- 17 హోలి, బలిజహరణములు
- 18 పూర్ణాహుతి, చక్రతీర్థం
- 19 గ్రామ సేవ, గ్రామోత్సవం (డేగాట), హోలీ కార్యక్రమం

## పద్మశాలీల సమస్యలను పరిష్కరించాలి

మిర్యాలగూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీల సమస్యలను పరిష్కరించాలని పద్మశాలీ సంఘం జిల్లా నాయకుడు యర్రమాద రాములు అన్నారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన అఖిలభారత 17వ పద్మశాలీ మహాసభలకు తరలివెళ్లిన మిర్యాలగూడ పట్టణ పద్మశాలీ సంఘం వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని అన్నారు. అపరిష్కృతంగా ఉన్న చేనేత సమస్యల పరిష్కారం, రాజకీయ అవకాశాల కల్పన కోసం పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు జల్లా రాంబాబు, స్టీరింగ్ కమిటీ కన్వీనర్ భవాండ్ల పాండు, నాయకులు మిర్యాల కృష్ణయ్య, గుండు అంజయ్య, క్యామ వెంకటేశం, చిలుకూరి బాలకృష్ణ, రామప్రసాద్, చిలుకూరి శ్యామ్ పాల్గొన్నారు.

## సమాజ సేవలో భాగస్వాములు కావాలి

మిర్యాలగూడ టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ప్రముఖ వాస్తు సిద్ధాంతి మామిడి సత్యనారాయణ, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి అన్నారు. ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈదులగూడలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కారంపూడి నాగరాజు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం భారతసైన్యంలో విధులు నిర్వహిస్తున్న కాలనీవాసి సందీప్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పగడాల క్రాంతికుమార్, కందాల వంశీ, జన్నపాల శ్రీకాంత్, నాగరాజు, శివ, సుబ్బు, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నాట్కోలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలి



కార్మికులకు సభ్యత్వాలు అందజేస్తున్న అవుతా సైదులు, బషీర్

నాగార్జునసాగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న నాట్కో ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, జిల్లా నాయకుడు ఎస్‌కే.బషీర్ డిమాండ్ చేశారు. సాగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నా ట్కో ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న క్యాజువల్ కార్మికులకు సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల సర్వీసులో ఉన్న క్యాజువల్, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మిక వర్గాలను ఐక్యం చేస్తూ ఉద్యమాలు నడపటంలో సీఐటీయూ ముందుంటుదని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులను కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రేబల్లె వెంకటేశ్వర్లు, అంజనేయులు, అనిల్, శ్రీను, నాగరాజు, రాము, రవి పాల్గొన్నారు.

## ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

మిర్యాలగూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బిల్ల కనకయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ యాసంగి వరికి వాతావరణం అనుకూలించక పంట దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. రైతులకు పంటల బీమా వర్తింపు చేయడం ద్వారా పంటనష్టాన్ని పూడ్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈ నెల 18న దేవరకొండ నియోజకవర్గం చింతపల్లిలో నిర్వహించనున్న రైతుసంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రబోతు పద్మ, గువ్వల వెంకటయ్య, కట్ట ఇద్దయ్య, బంటు బుచ్చయ్య, రాజేశ్వరి, మట్టయ్య, దుర్గమ్మ, షమీం, అంజమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

# ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి...

**జిల్లాలో పలు చోట్ల అ‘పూర్వ’విద్యార్థుల సమ్మేళనం**



మిర్యాలగూడలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్, చింతపల్లి, త్రిపురారం, మార్చి 9(ఆంధ్రజ్యోతి) ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిశాము... చదువులమ్మ చెట్టు నీడలో.. అని పూర్వ విద్యార్థులు పాడుకున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పదో తరగతిలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని నేతాజీ మెమోరియల్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. 1990-91 సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీపతి శ్రీనివాస్, వరలక్ష్మి, రఘునాథం, విద్యాసాగర్, మంజుల, అరుణ, నాగలక్ష్మీ, గౌరి, శ్రీదేవి, నీరజ, సునీత, నాగరాజు, శంకర్, నగేందర్ పాల్గొన్నారు.

● చింతపల్లి మండలంలోని కుర్మేడ్ జడ్పీహెచ్‌ఎస్ 1997-98 పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, లక్ష్మణ్‌రావు, బ్రహ్మాచారి, హనుమరాజు, రాజ్యానాయక్, పూర్వ విద్యార్థులు ముద్దం రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, పరమేష్, అంజయ్య, సురేందర్, బాబు, పుప్పాల లక్ష్మీనారాయణ, అలివేలు, బాబు పాల్గొన్నారు.

● త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు సమావేశమయ్యారు. పాఠశాలలో 1995-96లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 29 ఏళ్ల తరువాత సుమారు 64 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో కలిసి వచ్చి సరదాగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు కలిమెల నాగయ్య, రవి, నారాయణరెడ్డి, ఎస్‌కె జానీమియా, సుబ్రహ్మణ్య శర్మ, సాగర్‌రావు, సూర్యనారాయణరెడ్డి, వెంకటయ్య, గంగాధర్‌రావు, ముత్యాలు, విద్యార్థులు సింహాద్రి, అశోక్, నాగిరెడ్డి, హుస్సేన్, సైదులు, దమయంతి, పుష్పలత, జ్యోతి, సాయిలు, బిక్షం, సుధారాణి పాల్గొన్నారు.



కుర్మేడ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



త్రిపురారం : నీలాయిగూడెంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు